దేశరాజధాని ఢిల్లీలో
ఈరోజు బంగారం ధర

తులం బంగారం
(10 గ్రాములు)

1,44,540/-
(22 క్యారెట్స్)

1,56,150/-
(24 క్యారెట్స్)


# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక: 61 | ఎడిటర్: మేనం శ్యామ్ | శనివారం 19-09-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

యూట్యూబర్ వైష్ణవి హత్యతో
ఓ కుటుంబంలో విషాదం మొదలైంది.
రోజులు గడిచినా పుట్టింటి గుండెల్లో
పగ చల్లారలేదు.
చెల్లెలి మరణం అన్నయ్య గుండెల్లో
కక్షగా మారింది.
చివరకు అదే కక్ష
హరిబాబు ప్రాణాలను బలిగొంది.
ఎనిమిది సెకన్లు... తొమ్మిది కత్తిపోట్లు...
ఒక ప్రాణానికి ముగింపు!
వైష్ణవి రక్తంతో మొదలైన విషాదం..
హరిబాబు రక్తంతో మరో పేజీ రాసుకుంది.
ఇది ప్రతీకారమా?
పగకు పగ తీర్చుకున్న రక్తపాతమా?
లేక రెండు కుటుంబాలను
చీకటిలోకి నెట్టిన
అంతులేని విషాదమా?

అరుణ్ రెడ్డి పన్నాల



# వెలికట్టలో హరీశ్‌రావు బంధువు భూముల పరిశీలన

## రికార్డులపై కాంగ్రెస్ ఆరా!

- సీఎం రేవంత్ ఆదేశాలతో వెలికట్టలో కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్సీల బృందం పర్యటన
- సర్వే నంబర్ 271లో 6 ఎకరాల 2 గుంటల అసైన్డ్ భూముల పరిశీలన
- హరీశ్ రావు బంధువు హనుమంతరావుకు చెందిన భూములపై ఆరా
- తహసీల్దార్ ను విచారించిన కాంగ్రెస్ ప్రతినిధుల బృందం
- భూముల బదలాయింపు, నిబంధనల అమలుపై వివరాల సేకరణ





**ప్రజా వాయిస్, సిద్దిపేట:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల నేపథ్యంలో కొండపాక మండలం వెలికట్ట గ్రామంలో కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్సీల ప్రతినిధుల బృందం శుక్రవారం పర్యటించింది. గ్రామ శివారులోని సర్వే నంబర్ 271లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు బంధువు హనుమంతరావుకు చెందినట్లు పేర్కొంటున్న 6 ఎకరాల 2 గుంటల అసైన్డ్ భూములను బృందం పరిశీలించింది.

**తహసీల్దార్‌ను విచారించిన బృందం**

భూములకు సంబంధించిన వివరాలపై కొండపాక తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డిని కాంగ్రెస్ ప్రతినిధుల బృందం విచారించింది. రికార్డులు, పహాణీలు, పట్టాదారు వివరాలతో పాటు భూముల స్వభావం, వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించింది.

**బదలాయింపుపై వివరాల సేకరణ**

అసైన్డ్ భూముల కొనుగోలు, బదలాయింపుకు సంబంధించిన వివరాలను బృందం సేకరించింది. భూముల బదలాయింపు జరిగిందా? జరిగితే నిబంధనలకు అనుగుణంగా జరిగిందా? అనే అంశాలపై అధికారులను ఆరా తీసినట్లు సమాచారం.

**రాజకీయంగా హాట్‌టాపిక్‌గా మారిన వ్యవహారం**

హరీశ్‌రావు బంధువు హనుమంతరావుకు సంబంధించినట్లు పేర్కొంటున్న భూములను కాంగ్రెస్ ప్రతినిధుల బృందం పరిశీలించడంతో వెలికట్ట భూముల వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. భూములకు సంబంధించిన రికార్డులు, బదలాయింపు అంశాలపై అధికారులు అందించే వివరాలపై ఆసక్తి నెలకొంది.

## చేవెళ్ల ఎక్సైజ్‌లో... మామూళ్ల మత్తు..?

- ఇక్కడిదాకా వచ్చాం.. ఏమీ లేదా?అంటూ డిమాండ్
- డబ్బులు ఇవ్వకుంటే శాంపిల్స్ తీస్తాం
- దుకాణాలు మూయిస్తాం అంటూ బెదిరింపులు, బూతు పురాణాలతో గీత కార్మికులపై దౌర్జన్యం?
- శాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో నగదు వసూలు చేశారంటూ తీవ్ర ఆరోపణ
- ఊరు ఊరుకూ ఎంత తీసుకున్నారో.. లెక్కలతో సహా ఫిర్యాదులో పేర్కొన్న బాధితుడు
- ఓ ఏసీబీ అధికారి మందలించినా.. తగ్గని వసూళ్ల దూకుడు
- గీత కార్మికుడి గోడు ఎక్సైజ్ కమిషనర్‌కు ఫిర్యాదు
- శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



**చేవెళ్ల (ప్రజావాయిస్ ):** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఎక్సైజ్ శాఖలోని కొందరి అధికారుల అవినీతి, అక్రమాలు తార స్థాయికి చేరాయని .చట్టాన్ని పరిరక్షించాల్సిన వారే లంచాల మత్తులో జోగుతున్నారని పొద్దంతా చెట్టెక్కి కల్లు గీసి.. చెమటోడ్చి బతికే గీత కార్మికులపై ఎక్సైజ్ అధికారుల వేధింపుల ఆరోపణలు ఎక్కువయ్యాయని గీత కార్మికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. తనిఖీల పేరుతో గ్రామాల్లోకి వస్తున్న అధికారులు ఇక్కడిదాకా వచ్చాం.. ఏమీ లేదా? అంటూ డబ్బులు అడుగుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.అడిగినంత ఇవ్వకపోతే శాంపిల్స్ తీస్తాం.. కేసులు పెడతాం.. దుకాణాలు మూయిస్తాం అంటూ భయపెడుతున్నారని గీత కార్మికుడు జి. లక్ష్మయ్య గౌడ్ తన పిర్యాదులో ఆరోపించారు . షాబాద్ మండలంలో చేవెళ్ల

మిగతా 2లో

## హైదరాబాద్ మానవ అక్రమ రవాణా కేసులో కీలక తీర్పు

- మానవ అక్రమ రవాణా కేసులో తొమ్మిది మందికి జీవిత ఖైదు
- నిందితుల్లో ఎనిమిది మంది బంగ్లాదేశ్ జాతీయులు
- ఉద్యోగాలు, మంచి వేతనాల పేరుతో మహిళలను భారత్‌కు తరలింపు
- వ్యభిచారంలోకి బలవంతంగా దింపినట్లు దర్యాప్తులో నిర్ధారణ
- నిందితులకు రూ.1.37 లక్షల జరిమానా కూడా విధించిన కోర్టు

2 లో



## తెలంగాణపై ఎల్‌నినో ప్రభావం.. నీటి నిల్వలు భారీగా తగ్గాయి!

- ఎల్‌నినో ప్రభావాన్ని అత్యంత తీవ్రంగా చూడాల్సిన అవసరం: ఉత్తమ్
- ఆలస్యమవుతున్న వర్షాలు.. పెరుగుతున్న వర్షాల మధ్య విరామాలు
- జలాశయాలు, చెరువుల్లో తగ్గుతున్న నీటి నిల్వలు
- గతేడాది 333 టీఎంసీలు.. ఈ ఏడాది 160 టీఎంసీలకు పడిపోయిన నిల్వలు
- తాగునీరు, సాగునీరు, విద్యుత్‌పై ముందస్తు ప్రణాళిక అవసరం



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** తెలంగాణ ప్రజల ముందున్న ఎల్‌నినో సమస్యను అత్యంత తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శాసనసభలో ఎల్‌నినో ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలపై ప్రారంభమైన లఘు చర్చలో ఆయన ప్రసంగించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యం కావడంతో పాటు వర్షాల మధ్య విరామాలు పెరుగుతున్నాయని తెలిపారు.

**నీటి నిల్వలపై ప్రభావం**

ఎల్‌నినో ప్రభావంతో జలాశయాలు, చెరువుల్లో నీటి నిల్వలు తగ్గుతున్నాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. దీని ప్రభావం

మిగతా 2లో

## ఫార్ములా-ఈ కేసు.. నాంపల్లి ఏసీబీ కోర్టుకు కేటీఆర్!

- ఛార్జ్‌షీట్‌పై వాదనలు వినిపించేందుకు కోర్టుకు హాజరు
- కేటీఆర్‌తో పాటు ఏ2, ఏ3 నిందితులు కూడా హాజరు
- కోర్టు వద్ద భారీ బందోబస్తు.. ఏసీబీ ఆధ్వర్యంలో భద్రత
- రూ.55 కోట్ల చెల్లింపుల్లో అవకతవకలు జరిగాయని ఏసీబీ ఆరోపణ
- కేసును బోగస్ కేసుగా అభివర్ణిస్తున్న కేటీఆర్



## ఖైరతాబాద్‌లో ఉపఎన్నికకు దానం సిద్ధం

- కీలక వ్యాఖ్యలు!
- హైకోర్టు అనర్హత తీర్పును స్వాగతించిన దానం నాగేందర్
- ప్రస్తుతానికి సుప్రీం కోర్టుకు వెళ్లే ఆలోచన లేదని వెల్లడి
- ఉపఎన్నిక వస్తే ఎదుర్కొనేందుకు సిద్ధమని ప్రకటన
- రాజకీయ పోరాటాలు తనకు కొత్తేమీ కాదని వ్యాఖ్య
- మళ్లీ ప్రజాక్షేత్రంలో పోరాడి విజయం సాధిస్తానని ధీమా



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన స్పందించారు. కోర్టు తీర్పును స్వాగతిస్తున్నానని, ప్రస్తుతానికి సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచన లేదని తెలిపారు. ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక జరిగే పరిస్థితి వస్తే దాన్ని ఎదుర్కొనేందుకు పూర్తిగా

మిగతా 2లో

## తెలంగాణపై ఎల్‌నినో ప్రభావం

- ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు: సీతక్క!
- తెలంగాణపైనా ఎల్‌నినో ప్రభావం ఉంటుందని మంత్రి సీతక్క వెల్లడి
- వర్షాభావ పరిస్థితులతో నీటి లభ్యతపై ప్రభావం
- తక్కువ నీటితో సాగయ్యే పంటల వైపు రైతులు మళ్లాలి
- వరి సాగు విస్తీర్ణం తగ్గిందని.. ప్రత్యామ్నాయ పంటలపై సూచనలు
- తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం
- కేంద్రం నిధులు ఇవ్వాలని డిమాండ్



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** ఎల్‌నినో ప్రభావం తెలంగాణపై కూడా ఉంటుందని మంత్రి సీతక్క అన్నారు. ఇది కేవలం రాష్ట్ర సరిహద్దులకు పరిమితమైన పరిస్థితి కాదని, పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో వచ్చిన మార్పుల కారణంగా ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. దీని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా

మిగతా 2లో

## దానం నాగేందర్ ఫైటర్ కాదు.. చీటర్

- పాడి కౌశిక్ రెడ్డి!
- హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్యం సాధించిన విజయమని వ్యాఖ్య
- పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన మిగతా 8 మందిపైనా అనర్హత వేటు తప్పదని వెల్లడి
- హైకోర్టు తీర్పు సీఎం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు అంటూ విమర్శ
- ఖైరతాబాద్ ఉపఎన్నికలో బీఆర్ఎస్‌దే విజయం అని ధీమా
- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నైతికత అంశాన్ని తేల్చాలని డిమాండ్

2 లో



# హైదరాబాద్ మానవ అక్రమ రవాణా కేసులో కీలక తీర్పు

**ప్రజా వాయిస్, హైదరాబాద్:** హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన మానవ అక్రమ రవాణా కేసులో హైదరాబాద్ ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో తొమ్మిది మంది నిందితులకు న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. వీరిలో ఎనిమిది మంది బంగ్లాదేశ్ జాతీయులు ఉన్నారు. నిందితులకు రూ.1.37 లక్షల జరిమానా కూడా విధించింది.

**ఉద్యోగాల పేరుతో మహిళలకు వల**

2019లో బంగ్లాదేశ్ మహిళలను అక్రమంగా భారత్‌కు తరలించిన వ్యవహారంపై కేసు నమోదైంది. ఉద్యోగాలు, మంచి వేతనాలు ఇప్పిస్తామని నమ్మించి పలువురు మహిళలను నిందితులు భారత్‌కు తీసుకొచ్చినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం వారిని బలవంతంగా వ్యభిచారంలోకి దింపినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో నిర్ధారణ అయింది.

**పహాడీషరీఫ్‌లో కేసు నమోదు**

2019 సెప్టెంబర్‌లో హైదరాబాద్ పహాడీషరీఫ్ పోలీసులు ఈ కేసును నమోదు చేశారు. జల్‌పల్లిలోని ఓ వ్యభిచార గృహంపై దాడి చేసి ముగ్గురు బంగ్లాదేశ్ మహిళలను పోలీసులు రక్షించారు. బాలాపూర్ మహ్మద్ కాలనీలోని ఓ ఇంటి నుంచి మరో మహిళను కూడా కాపాడారు. అనంతరం కేసును ఎన్ఐఏ స్వాధీనం చేసుకుని పునఃనమోదు చేసింది.

**12 మందిపై చార్జిషీట్**

ఈ కేసులో ఏ1 నుంచి ఏ12 వరకు మొత్తం 12 మందిపై ఎన్ఐఏ చార్జిషీట్ దాఖలు చేసింది. 2020 అక్టోబర్ 17న న్యాయస్థానంలో చార్జిషీట్ సమర్పించింది. 2019–2020 మధ్య తెలంగాణ, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాల్లో నిందితులను ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. అయితే ఏ1, ఏ3, ఏ7 నిందితులు పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**జరిమానా చెల్లించకపోతే అదనపు జైలు**

తీర్పులో భాగంగా నిందితులకు రూ.1.37 లక్షల జరిమానా విధించారు. ఈ జరిమానా చెల్లించకపోతే అదనంగా మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయస్థానం ఆదేశించింది.

# చేవెళ్ల ఎక్సైజ్‌లో... మామూళ్ల మత్తు..?




**మొదటి పేజీ తరువాయి**
ఎక్సైజ్ డీటీఎఫ్ బృందంపై వచ్చిన ఈ ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

**ఊరూరా.. ఎంతెంత?**
**లెక్కలతో సహా ఫిర్యాదు..**

తన ఫిర్యాదులో సెప్టెంబర్ 11న శాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో వసూళ్లు జరిగినట్లు పేర్కొంటూ గ్రామాల వారీగా మొత్తాలను కూడా వివరించినట్లు సమాచారం. ఎట్ల ఎర్రవల్లి, దేవరంపల్లి, తిమ్మారెడ్డిగూడ, మక్తగూడ, తాళ్లపల్లి, నారగూడ, సీతారాంపూర్, రేగడిదొస్వాడ, కడుమూరు, బొబ్బిలిగామ తదితర గ్రామాల పేర్లను ఫిర్యాదులో ప్రస్తావించారు.

**ఏసీబీ మందలించినా..**
**మత్తు వీడలేరంటు ఆరోపణలు**

తమ తీరును ఓ ఏసీబీ అధికారి ప్రశ్నించి మందలించినప్పటికీ వసూళ్ల వ్యవహారం ఆగలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల నుంచి స్పష్టమైన విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలని వారు కోరుతున్నారు.

**వసూళ్ల టీమ్ ఇదే అంటూ పిర్యాదు..**

బాధితుల ఆరోపణల ప్రకారం టీఎస్ 34 టిబీ 5226 నంబరు వాహనంలో తిరుగుతూ వసూళ్లకు పాల్పడుతున్న బృందంలో డీటీఎఫ్ టీమ్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్సై శ్రీనివాస్, మరో అధికారి బి. అశోక్, హెడ్ కానిస్టేబుల్ కొండల్ రావు ఉన్నారని చెబుతున్నారు. ఈ నెల 11న షాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదుదారుడు పేర్కొన్నారు

**పండుగొస్తే.. మామూళ్లకు పండుగేనా?**

సాధారణ రోజుల్లోనే ఇలాంటి ఆరోపణలు వస్తుంటే.. పండుగల వేళ పరిస్థితి ఎలా ఉంటుందనే చర్చ స్థానికంగా జరుగుతోంది. మరికొన్ని ప్రాంతాల్లో ఫామ్‌హౌస్‌ల తనిఖీలు, రైడ్ల పేరుతో కూడా వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు స్వతంత్ర ఆధారాలు బయటపడాల్సి ఉంది.



**గీత కార్మికుడి గోడు..**
**ఎక్సైజ్ కమిషనర్ గడపకు..**

అధికారుల వేధింపులు భరించలేక షాబాద్ మండలం ఏట్ల ఎర్రవల్లికి చెందిన కల్లు గీత కార్మికుడు జి. లక్ష్మయ్య గౌడ్ ఎక్సైజ్ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ప్రజావాయిస్ తో తెలిపారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న వారిపై విచారణ జరిపి, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

**డబ్బులు తీసుకోలేదు'.. ఎక్సైజ్ ఖండన**

ఇదిలా ఉండగా, ఈ ఆరోపణలను సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఖండించారు. తాము ఎక్కడా డబ్బులు వసూలు చేయలేదని చేశారు. ఫ్యూచర్ సిటీ ప్రాంతానికి బాధ్యతలు అప్పగించిన అనంతరం కల్లు దుకాణాల తనిఖీలకు వెళ్లామని, కొన్ని గ్రామాలకు తాము ఇంకా వెళ్లలేదని తెలిపారు. కేవలం తనిఖీల కోసమే వెళ్లామని ఆయన వివరణ ఇచ్చారు.బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపిస్తే నిజానిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# ఛాలెంజ్ వాల్యుయేషన్ ఫలితాలకే ముందే సప్లిమెంటరీ ఫీజులా?

- 40 శాతం పాస్ రూల్‌పై స్పష్టత ఇవ్వాలని లా విద్యార్థుల డిమాండ్
- పరీక్షల మూల్యాంకనంలో పారదర్శకతపై అనుమానాలు
- ఆర్టీఐ ఫస్ట్ అప్పీల్‌కూ స్పందన లేదంటున్న విద్యార్థులు
- శాఖల చుట్టూ తిప్పుతున్నారంటూ ఆవేదన
- సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతున్న విద్యార్థులు

**ప్రజా వాయిస్,హైదరాబాద్.** కాకతీయ యూనివర్సిటీ పరిధిలో న్యాయ విద్యను అభ్యసిస్తున్న 5వ, 6వ సెమిస్టర్ విద్యార్థులు పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, సప్లిమెంటరీ పరీక్షలు, 40 శాతం పాస్ రూల్ అమలుపై పలు సమస్యలను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 5వ, 6వ సెమిస్టర్‌లలో ఫెయిల్ అయిన సబ్జెక్టులకు సప్లిమెంటరీ నిర్వహించబోమని, తదుపరి సంవత్సరం రెగ్యులర్‌గా పరీక్షలు రాయాల్సి ఉంటుందని అధికారులు తెలిపిన నేపథ్యంలో, తాము ఒక్కొక్కరు రూ.10 వేల వరకు చెల్లించి ఛాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నామని విద్యార్థులు తెలిపారు. అయితే ఛాలెంజ్ వాల్యుయేషన్ ఫలితాలు వెలువడకముందే అడ్వాన్స్ సప్లిమెంటరీ నోటిఫికేషన్ రావడంతో, ఫలితాల కోసం ఎదురుచూస్తూనే సప్లిమెంటరీ ఫీజు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దూర ప్రాంతాల్లో ఉంటూ కోర్టు ప్రాక్టీస్ చేసుకుంటున్న తమకు యూనివర్సిటీ చుట్టూ తిరగడం, అదనపు పరీక్షల ఫీజులు చెల్లించడం ఆర్థికంగా భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తర్వాతి బ్యాచ్ 25068Lకు 40 శాతం పాస్ రూల్ అమలు చేసిన నేపథ్యంలో, అదే నిబంధన తమ బ్యాచ్‌కు ఎందుకు వర్తింపజేయడం లేదో స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. కోర్సు మధ్యలో నిబంధనలు అమలు చేయడం, ఇప్పటికే జారీ చేసిన మెమోలను వెనక్కి తీసుకుని కొత్త మెమోలు విడుదల చేయడంపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఈ అంశాలపై సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరగా, ఫస్ట్ అప్పీల్‌కు కూడా సమాధానం రాలేదని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించేందుకు ఎగ్జామ్ బ్రాంచ్‌ను సంప్రదిస్తే లా బ్రాంచ్‌కు, అక్కడి నుంచి బీఓఏలకు పంపుతూ ఒక్కో విభాగం నుంచి ఒక్కో విధమైన సమాధానం చెబుతున్నారని విద్యార్థులు వాపోయారు. ప్రధాన పరీక్షల్లో ఫెయిల్ అయిన కొంతమంది విద్యార్థులు రీ-వాల్యుయేషన్ అనంతరం ఉత్తీర్ణులవుతున్నప్పటికీ, మూల్యాంకన ప్రక్రియపై తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

# లక్షల కోట్ల భూ అవినీతిపై కేసులు ఎందుకు పెట్టడం లేదు?

- గత ప్రభుత్వ హయాంలో అవినీతి జరిగిందని చెబుతూ చర్యలు ఎందుకు లేవని ప్రశ్న
- 23 లక్షల ఎకరాల భూ మార్పిడి జరిగిందంటే రిజిస్ట్రేషన్లు ఎందుకు రద్దు చేయడం లేదని నిలదీత
- భూ వ్యవహారాలపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్
- 22ఏ భూములపై రైతులు ఇబ్బందులు పడుతున్నారని పాయల్ శంకర్ ఆరోపణ
- ఇందిరాపార్క్ వద్ద 22ఏ బాధితుల కోసం ఆందోళన చేపట్టినట్లు వెల్లడి



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** గత ప్రభుత్వ హయాంలో లక్షల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారని, మరి ఆ వ్యవహారాలపై కేసులు పెట్టి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా జరిగిన భూ లావాదేవీలపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**23 లక్షల ఎకరాలపై ప్రశ్నలు**

23 లక్షల ఎకరాల భూ మార్పిడి జరిగిందని ముఖ్యమంత్రి చెప్పారని మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. అలాంటప్పుడు సంబంధిత రిజిస్ట్రేషన్లను ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. ధరణి, ప్రస్తుతం భూ భారతి పేరుతో లక్షల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపణలు వస్తున్నాయని, భూముల వివరాలను ఎందుకు బహిర్గతం చేయడం లేదని నిలదీశారు. అటవీ భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**న్యాయ విచారణకు డిమాండ్**

భూ వ్యవహారాలపై న్యాయ విచారణ జరిపించాలని మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, విచారణ పూర్తయ్యే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. నిషేధిత భూముల వివరాలను బహిరంగపరచాలని, గతంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భూ లావాదేవీలపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**22ఏ భూములపై పాయల్ శంకర్ ఆందోళన**

బీజేఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ మాట్లాడుతూ.. 22ఏ నిషేధిత జాబితాలో లక్షల మంది రైతుల భూములను చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. నిషేధిత జాబితాలో చేరిన భూముల బాధితుల తరపున తమ పార్టీ పోరాడుతోందని తెలిపారు. ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేలా 22ఏ బాధితుల కోసం ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహించినట్లు వెల్లడించారు.

# ఫార్ములా-ఈ కేసు.. నాంపల్లి ఏసీబీ కోర్టుకు కేటీఆర్!

ప్రజా వాయిస్, హైదరాబాద్:బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసు విచారణ నిమిత్తం నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరయ్యారు. ఏసీబీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌పై కేటీఆర్ తన వాదనలు వినిపించనున్నారు. దీంతో నేటి కోర్టు విచారణలో జరిగే పరిణామాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

**కేటీఆర్‌తో పాటు ఇతర నిందితులు**

ఈ కేసులో కేటీఆర్‌తో పాటు ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా ఉన్న హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు కూడా కోర్టుకు హాజరయ్యారు. కేటీఆర్ కోర్టుకు వస్తున్న నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏసీపీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

**రూ.55 కోట్ల చెల్లింపులపై ఏసీబీ ఆరోపణలు**

ఫార్ములా-ఈ కార్ రేసు నిర్వహణకు సంబంధించి రూ.55 కోట్ల చెల్లింపుల్లో అవకతవకలు జరిగాయని ఏసీబీ ఆరోపిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు చెల్లింపులు చేశారని పేర్కొంటూ కేసు నమోదు చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ వ్యవహారంలో కేటీఆర్‌ను ఏసీబీ ఇప్పటికే పలుమార్లు ప్రశ్నించింది.

**బోగస్ కేసు అంటున్న కేటీఆర్**

ఫార్ములా-ఈ కేసును కేటీఆర్ బోగస్ కేసుగా అభివర్ణిస్తున్నారు. ఏసీబీ ఆరోపణలను ఆయన గతంలోనే ఖండించారు. తాజాగా ఛార్జ్‌షీట్‌పై కోర్టులో కేటీఆర్ వాదనలు వినిపించనున్న నేపథ్యంలో విచారణపై ఉత్కంఠ నెలకొంది.

# దానం నాగేందర్ ఫైటర్ కాదు.. చీటర్

**ప్రజా వాయిస్, హైదరాబాద్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఫైటర్ కాదని.. చీటర్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేయడం ప్రజాస్వామ్యం సాధించిన విజయమని అభివర్ణించారు.
శుక్రవారం తెలంగాణ భవన్‌లో హైకోర్టు తీర్పుపై ఆయన స్పందించారు.

**మిగతా 8 మందిపైనా అనర్హ్వత వేటు తప్పదు**

దానం నాగేందర్‌కు పట్టిన గతే పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన మిగతా ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు కూడా పడుతుందని కౌశిక్ రెడ్డి అన్నారు. ఈ రెండున్నరేళ్లుగా బీఆర్ఎస్ చేసిన పోరాటానికి ఇది దక్కిన విజయమని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు సీఎం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు అని వ్యాఖ్యానించారు.

**ఖైరతాబాద్‌లో బీఆర్ఎస్‌దే గెలుపు: కౌశిక్**

త్వరలో జరగనున్న ఖైరతాబాద్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని కౌశిక్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రజలను ఎల్లకాలం మోసం చేయవచ్చని సీఎం రేవంత్‌రెడ్డి భావించారని, అయితే హైకోర్టు తీర్పుతో దానికి బ్రేక్ పడిందని వ్యాఖ్యానించారు. ఖైరతాబాద్ ఓటర్లు ప్రభుత్వానికి తగిన తీర్పు ఇస్తారని అన్నారు.

**ఎథిక్స్ కమిటీ తేల్చాలి**

పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారంలో నైతికత అంశాన్ని ఎథిక్స్ కమిటీ తేల్చాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. కడియం శ్రీహరిది అనైతికమా.. తనదే అనైతికమా అనే విషయాన్ని కమిటీ నిర్ణయించాలని అన్నారు. మిగతా ఎనిమిది నియోజకవర్గాల్లోనూ ఉపఎన్నికలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# చెత్త సేకరణ రాంకీకి అప్పగింత.. స్వచ్ఛ ఆటో కార్మికుల ఆందోళన!

- ఇంటింటి చెత్త సేకరణను రాంకీ సంస్థకు అప్పగించిన ప్రభుత్వం
- నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జీహెచ్‌ఎంసీ కార్యాలయం ముట్టడి
- కమిషనర్ కు వినతిపత్రం ఇచ్చేందుకు కార్మికుల ప్రయత్నం
- అడ్డుకున్న పోలీసులతో కార్మికుల తోపులాట
- మహిళా కార్మికుల అరెస్ట్.. ఉద్రిక్తంగా మారిన పరిస్థితులు

**ప్రజా వాయిస్, హైదరాబాద్:** నగరంలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ బాధ్యతను రాంకీ సంస్థకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వచ్ఛ ఆటో కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ముట్టడికి తరలివచ్చి ఆందోళన చేపట్టారు.కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు యత్నంప్రభుత్వ నిర్ణయంపై తమ అభ్యంతరాలను తెలియజేస్తూ జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించేందుకు స్వచ్ఛ ఆటో కార్మికులు ప్రయత్నించారు. అయితే పోలీసులు వారిని అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.పోలీసులతో తోపులాట.. మహిళా కార్మికుల అరెస్టోప్లీసులు అడ్డుకోవడంతో స్వచ్ఛ ఆటో కార్మికులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆందోళనలో పాల్గొన్న మహిళా కార్మికులను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు తమ నిరసన కొనసాగిస్తామని కార్మికులు డిమాండ్ చేశారు.

# తెలంగాణపై ఎల్‌నినో ప్రభావం

కనిపిస్తోందని, తెలంగాణలోనూ వర్షాభావ పరిస్థితులు, నీటి లభ్యతపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు.

**ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన**

వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటల వైపు మళ్లాలని ప్రభుత్వం అవగాహన కల్పిస్తోందని సీతక్క తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వరి సాగు విస్తీర్ణం తగ్గిందని, రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై సూచనలు చేస్తున్నామని చెప్పారు. తక్కువ నీటి అవసరమయ్యే పంటలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను అమలు చేస్తోందన్నారు.

**తాగునీటికి అత్యంత ప్రాధాన్యం**

ప్రస్తుతం రాష్ట్రంలో తాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాల కోసం కాపాడుతున్నామని తెలిపారు. కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లోని జలాశయాల ద్వారా ప్రజలకు తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు కార్యాచరణతో పనిచేస్తోందన్నారు.

**కేంద్రం నుంచి నిధులు ఇవ్వాలి**

తాగునీటి అవసరాలను తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన నిధులు అందించాలని సీతక్క కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు కూడా కీలకంగా మారుతున్న నేపథ్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్రం 90 శాతం నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**కేంద్ర—రాష్ట్ర సమన్వయంతో చర్యలు**

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటలు, తాగునీటి నిర్వహణ వంటి అంశాలపై కేంద్రం—రాష్ట్రం సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అదే సమయంలో ఎల్‌నినో విషయంలో ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆమె ఆరోపించారు.

# తెలంగాణపై ఎల్‌నినో ప్రభావం.. నీటి నిల్వలు భారీగా తగ్గాయి!

రైతుల పంటలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రజల తాగునీటి భద్రతపై పడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా విత్తనాలు వేసే కీలక సమయంలో వర్షాలు లేకపోవడం రైతుకు కేవలం ప్రకృతి సమస్య కాదని.. పెట్టుబడి, అప్పులు, కుటుంబ భవిష్యత్తుతో ముడిపడిన జీవన్మరణ సమస్య అని అన్నారు.

**కృష్ణా బేసిన్‌లో భారీగా తగ్గిన నిల్వలు**

ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉందో గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని మంత్రి తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి కృష్ణా బేసిన్‌లోని ప్రధాన, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల్లో సుమారు 333 టీఎంసీల జీవ నిల్వ ఉండగా.. ఈ ఏడాది అదే సమయానికి సుమారు 160 టీఎంసీలకు పడిపోయిందని వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే నీటి నిల్వలు భారీగా తగ్గాయని తెలిపారు.

**తాగునీరు, సాగునీటికి ముందస్తు ప్రణాళిక**

నీటి నిల్వలు తగ్గడం రైతుల సాగునీటితో పాటు తాగునీటి భద్రతపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో తాగునీరు, సాగునీరు, విద్యుత్ అవసరాలను సమన్వయం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ అంశంపై రాజకీయ ఆరోపణలకు తావివ్వకుండా వాస్తవ గణాంకాలు, శాస్త్రీయ ఆధారాలతో చర్చ జరగాలని మంత్రి సూచించారు.

# ఖైరతాబాద్‌లో ఉపఎన్నికకు దానం సిద్ధం

**మొదటి పేజీ తరువాయి**

సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

**ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటా**

ఉపఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని దానం నాగేందర్ అన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం, రాజకీయ పోరాటాలు చేయడం తనకు కొత్తేమీ కాదని పేర్కొన్నారు. మరోసారి ప్రజల్లోకి వెళ్లి తన బలాన్ని నిరూపించుకుంటానని ధీమా వ్యక్తం చేశారు.

**పార్టీ మార్పుతో మొదలైన వివాదం**

2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత పార్టీ మారడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దానం నాగేందర్‌పై వేర్వేరుగా అనర్హత పిటిషన్లు దాఖలు చేశారు.

**ఖైరతాబాద్ పై రాజకీయ ఉత్కంఠ**

హైకోర్టు తాజా తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉపఎన్నిక అంశం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే తదుపరి న్యాయపరమైన పరిణామాలు, ఎన్నికల ప్రక్రియపై అధికారిక నిర్ణయాల తర్వాతే ఉపఎన్నికపై స్పష్టత రానుంది. మరోవైపు దానం నాగేందర్ ఇప్పటికే ఎన్నికల పోరుకు సిద్ధమనే సంకేతాలు ఇవ్వడంతో ఖైరతాబాద్‌లో రాజకీయ సమీకరణాలపై ఆసక్తి నెలకొంది.

# లంచం తీసుకుంటూ ఏసిబికి చిక్కిన హాస్టల్ వార్డెన్

- కుక్ జీతం చెల్లించేందుకు 14 వేల రూపాయలు లంచం డిమాండ్
- లంచం తీసుకుంటుండగా వార్డెన్ ను చాకచక్యంగా పట్టుకున్న ఎసిబి అధికారులు



**ప్రజా వాయిస్ /చర్ల:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం సత్యనారాయణపురం ఎస్టీ బాలుర వసతి గృహ హాస్టల్ వార్డెన్ భూక్యా వాల్ సింహ లంచం తీసుకుంటు ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు హాస్టల్లో పనిచేస్తున్న కుక్ బిల్లు చేసేందుకు 20 వేల రూపాయల లంచం డిమాండ్ చేశారు సదరు వ్యక్తి అంత మొత్తంలో డబ్బులు ఇవ్వలేని 14 వేల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్నారు తర్వాత ఈ వ్యవహారంపై బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు ఫిర్యాదు అందిన వెంటనే ఏసిబి డిఎస్పి వై. రమేష్ బృందం ఆధ్వర్యంలో రంగంలోకి దిగి పక్క ప్రణాళికతో వ్యూహాత్మకంగా వలపన్ని లంచం తీసుకుంటుండగా వార్డెన్ భూక్య వాల్ సింహాను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు ఏసీబీ దాడుల్లో వార్డెన్ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడటంతో విచారణ చేస్తున్నట్లు ఏసిబి అధికారులు తెలిపారు ఏజెన్సీ మారుమూల ప్రాంతాల నుండి అవినీతికి వ్యతిరేకంగా ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు అవినీతికి పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఏసీబీ అధికారులు తెలిపారు ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు ఫిర్యాదు చేయాలని సూచించారు

# లిఫ్ట్ సర్వేలో మాయ.!

- వృద్ధ రైతు దంపతుల భూమికి పరిహారం ఏదీ.?
- 33 కుంటలు ప్రాజెక్టు పరిధిలోకి
- నష్టపరిహారంపై స్పష్టత లేదంటున్న బాధితులు
- మాయమాటలతో అగ్రిమెంట్లపై సంతకాలు చేయించుకున్నారని ఆరోపణ
- అడిగితే ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో
- అధికారుల తీరుపై ఆవేదన
- సర్వే నుంచి పరిహారం లెక్కల వరకు పూర్తిస్థాయి విచారణకు డిమాండ్



**ప్రజా వాయిస్,మోతె:** పంట పొలాలకు నీరందించేందుకు చేపట్టిన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు.. తమకు మాత్రం కన్నీళ్లు మిగుల్చుతోందని ఓ వృద్ధ రైతు దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైప్‌లైన్ కోసం తమ భూమిని తీసుకుంటున్నా.. భూమి విస్తీర్ణం, విలువకు తగ్గట్టుగా నష్టపరిహారం అందడం లేదని ఆరోపిస్తున్నారు. సర్వే సమయంలో అసలు పరిహారం ఎంత వస్తుందో చెప్పకుండా వివిధ రకాలుగా నచ్చజెప్పి అగ్రిమెంట్లపై సంతకాలు చేయించుకున్నారని వాపోతున్నారు. బురకచర్లలో వెలుగుచూసిన ఈ వ్యవహారం ఇప్పుడు అధికారుల తీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది.

### 33 కుంటలు ప్రాజెక్టు పరిధిలోకి..

మోతె మండలాన్ని సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు చేపట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. సిరికొండ రెవెన్యూ పరిధిలోని బురకచర్లలో పైప్‌లైన్ కోసం పలువురు రైతుల భూములు ప్రాజెక్టు పరిధిలోకి వచ్చినట్లు తెలుస్తోంది. రైతు బండారు సంజీవరెడ్డికి చెందిన సర్వే నంబర్ 192లో 17 కుంటలు, 194, 195, 196 సర్వే నంబర్లలో మరో 16 కుంటలు.. మొత్తం 33 కుంటల భూమి ప్రాజెక్టు పరిధిలోకి వచ్చినట్లు బాధితులు చెబుతున్నారు.

### పరిహారం చెప్పకుండానే సంతకాలు.?

సర్వే సందర్భంగా జీపీఓలు తమకు మాయమాటలు చెప్పి, భూమికి ఎంత పరిహారం వస్తుందో స్పష్టంగా వివరించకుండానే అగ్రిమెంట్లపై సంతకాలు చేయించుకున్నారని వృద్ధ దంపతులు ఆరోపిస్తున్నారు. అనంతరం నష్టపరిహారం వివరాలు అడిగినా సరైన సమాచారం ఇవ్వడం లేదని వాపోతున్నారు.

### ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో

తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ప్రయత్నించినప్పుడు సంబంధిత వ్యక్తులు బెదిరింపు ధోరణిలో మాట్లాడారని దంపతులు ఆరోపిస్తున్నారు.ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో ఏం చేసుకుంటావో చేసుకో అంటూ సమాధానం ఇచ్చారని పేర్కొంటున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తమను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రికార్డులు పరిశీలించాలి

ప్రజాప్రయోజన ప్రాజెక్టుల్లో రైతులకు అన్యాయం జరగకుండా అధికారులు జోక్యం చేసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. బాధితుల భూముల రికార్డులు, సర్వే వివరాలు, అగ్రిమెంట్లు, నష్టపరిహారం లెక్కలను సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. భూమి విలువకు, చట్ట నిబంధనలకు అనుగుణంగా అర్హమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# అపోలో ఫార్మసీలో కొలువుల జాతర

- 55 ఉద్యోగాలకు సెప్టెంబరు 22న జాబ్ మేళా
- భూపాలపల్లిలో 5.. హైదరాబాద్ లో 50 పోస్టులు
- 18–35 ఏళ్ల యువతకు అవకాశం
- ఫార్మసిస్ట్ , ఫార్మసీ అసిస్టెంట్ , అప్రెంటిస్ పోస్టులు
- నెలకు రూ.12,500 నుంచి రూ.25 వేల వరకు వేతనం

**ప్రజా వాయిస్,భూపాలపల్లి:** నిరుద్యోగ యువతకు అపోలో ఫార్మసీలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 22న జాబ్ మేళా నిర్వహించనున్నారు. భూపాలపల్లి ఐడీఓసీ కాంప్లెక్స్‌లోని కలెక్టరేట్ ఎఫ్3 బ్లాక్‌లో ఉదయం 11 గంటలకు మేళా ప్రారంభమవుతుందని జిల్లా ఉపాధి కల్పనాధికారి మానుపాటి మల్లయ్య తెలిపారు. మొత్తం 55 ఖాళీల్లో భూపాలపల్లిలో 5, హైదరాబాద్‌లో 50 పోస్టులు ఉన్నట్లు పేర్కొన్నారు.ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, అప్రెంటిస్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులు. ఫార్మసిస్ట్ పోస్టుకు డీ/బీ/ఎం–ఫార్మసీతో పాటు పీసీఐ సర్టిఫికెట్ అవసరం. ఫార్మసీ అసిస్టెంట్ పోస్టులకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీతో పాటు మెడికల్ స్టోర్‌లో అనుభవం ఉండాలి. అప్రెంటిస్ పోస్టులకు ఎస్ఎస్‌సీ, ఇంటర్ లేదా డిగ్రీ అర్హతగా నిర్ణయించారు.అభ్యర్థుల అర్హత, అనుభవాన్ని బట్టి నెలకు రూ.12,500 నుంచి రూ.25,000 వరకు వేతనం అందించనున్నట్లు అధికారులు తెలిపారు. అర్హత కలిగిన యువత ఈ నెల 22న ఉదయం 11 గంటలలోపు ఐడీఓసీ కాంప్లెక్స్‌లోని ఎఫ్3 బ్లాక్‌కు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9502468800 నంబర్‌ను సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి మానుపాటి మల్లయ్య కోరారు.

# బొలేరోలో తరలిస్తున్న పట్టిక పట్టివేత

- రూ.1.50 లక్షల విలువైన 15 క్వింటాళ్ల సరుకు స్వాధీనం
- గూడెం చెక్ పోస్ట్ వద్ద తనిఖీల్లో పట్టుకున్న పోలీసులు




**ప్రజా వాయిస్,చింతలమానపల్లి:** మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల పట్టికను చింతలమానపల్లి పోలీసులు పట్టుకున్నారు. గూడెం చెక్‌పోస్ట్ వద్ద బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా రూ.1.50 లక్షల విలువైన పట్టిక బయటపడింది. కోర్సిని గ్రామానికి చెందిన తోడేటి రాజేష్ మహారాష్ట్రలోని ఆహేర్ నుంచి పట్టికను తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.లంబడిహట్టి గ్రామానికి చెందిన శ్యామ్‌లాల్ సూచనల మేరకు పట్టికను తీసుకొచ్చినట్లు విచారణలో రాజేష్ వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో పట్టికతోపాటు బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశారు. ఎస్సై కమలాకర్ పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగుతోంది.



# ప్రాణాలు తీసే బెల్టు షాపులు బంద్ కావాల్సిందే.!

- లేదంటే ప్రజా వాయిస్ పోరు తప్పదు
- 60 వేల జనాభా.. 25కు పైగా బెల్టు షాపులు
- ఆస్పత్రి లేకున్నా.. ఊరూవాడా అక్రమ మద్యం అమ్మకాలు
- గుడుంబా దందాపైనా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు వినతి
- ప్రజా వాయిస్ ఫిర్యాదుపై ప్రత్యేక నిఘా
- దాడులు చేస్తామన్న ఎక్సైజ్ అధికారి


**ప్రజా వాయిస్,మంచిర్యాల**, (క్రైమ్ బ్యూరో):అభివృద్ధికి ఆదర్శంగా నిలవాల్సిన ప్రాంతంలో అక్రమ మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. సుమారు 60 వేల జనాభా ఉన్న ప్రాంతంలో 25కు పైగా బెల్టు షాపులు కొనసాగుతున్నాయని, వీటికి తోడు గుడుంబా విక్రయాలు కూడా విచ్చలవిడిగా జరుగుతున్నాయని 'ప్రజా వాయిస్' ప్రతినిధులు ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ప్రజల ఆరోగ్యానికి అవసరమైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోయినా.. మద్యం విక్రయ కేంద్రాలు మాత్రం విస్తరిస్తుండటంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. బెల్టు షాపులు, గుడుంబా విక్రయాల వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడటంతో పాటు యువతపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ మేరకు 'ప్రజా వాయిస్' మంచిర్యాల జిల్లా బ్యూరో శ్రీకాంత్ యాదవ్, క్రైమ్ బ్యూరో రాకేష్ పటేల్ జిల్లా ఎక్సైజ్ అధికారి బి.చాణక్యను కలిసి వినతిపత్రం అందజేశారు. అక్రమ మద్యం విక్రయాలు, గుడుంబా తయారీ, విక్రయాలపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.


### ప్రత్యేక నిఘా పెడతాం:

ప్రజా వాయిస్ ప్రతినిధులు లేవనెత్తిన అంశంపై జిల్లా ఎక్సైజ్ అధికారి బి.చాణక్య స్పందించారు. సంబంధిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. అక్రమంగా బెల్టు షాపులు నిర్వహించడం, గుడుంబా తయారీ, విక్రయాలు చేస్తున్నట్లు గుర్తిస్తే దాడులు నిర్వహించి నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# తప్పులు ప్రశ్నిస్తే.. దాడేనా.!

- జైపూర్ పీహెచ్ సీలో సిబ్బంది తీరుపై ఆరోపణలు
- బీపీ పరీక్షించకుండానే ఓపీ చీటీలో '100' రీడింగ్
- పురుషుడి రక్త పరీక్ష రిపోర్టులో 'స్త్రీ'గా నమోదు
- నిలదీసిన బాధితుడిపై సిబ్బంది దాడి.. డీఎంహెచ్ ఓకు ఫిర్యాదు, పోలీసులకు కంప్లైంట్





**ప్రజా వాయిస్,జైపూర్:**ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రశ్నించిన ఓ బాధితుడిపై దాడి జరిగిందన్న ఆరోపణలు మంచిర్యాల జిల్లా జైపూర్‌లో కలకలం రేపుతున్నాయి. జైపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో తనకు ఎదురైన అనుభవంపై బాధితుడు అధికారులకు ఫిర్యాదు చేశారు.బాధితుడి వివరాల ప్రకారం.. ఇటీవల జైపూర్ పీహెచ్‌సీకి వెళ్లిన సమయంలో ఓపీ చీటీ రాసే కౌంటర్ వద్ద సిబ్బంది తన బీపీని పరీక్షించకుండానే '100'గా నమోదు చేశారని ఆరోపించారు. అనుమానం రావడంతో వైద్యుడిని కలిసి మళ్లీ పరీక్ష చేయించుకోగా బీపీ అధికంగా ఉన్నట్లు తేలిందని తెలిపారు. ఇదే సమయంలో ఆసుపత్రిలో చేయించుకున్న రక్త పరీక్షల రిపోర్టులో తాను పురుషుడినైనా.. లింగం (జెండర్) కాలమ్‌లో 'స్త్రీ'గా నమోదు చేశారని పేర్కొన్నారు.

### ప్రశ్నించడంతో వివాదం

తనకు జరిగిన పొరపాట్లపై వివరణ కోరేందుకు పీహెచ్‌సీకి వెళ్లగా సిబ్బంది నుంచి సరైన స్పందన రాలేదని బాధితుడు ఆరోపించారు. ఈ క్రమంలో వాగ్వాదం జరిగి.. కొందరు సిబ్బంది తనపై దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉండగా, తప్పులను ప్రశ్నించినందుకు దాడి చేయడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### అధికారులకు ఫిర్యాదు

ఘటనపై బాధితుడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పీహెచ్‌సీలో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# విరిగిన విద్యుత్ స్తంభం.. అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట

- వైర్ల ఆధారంగా వేలాడుతున్న స్తంభం
- నిత్యం వేలాది వాహనాల రాకపోకలు
- పొంచి ఉన్న ప్రమాదం
- అధికారుల దృష్టికి వెళ్లినా చర్యలు శూన్యం
- వైర్లపై పెరిగిన స్తంభం బరువు
- ఎప్పుడు తెగిపడుతుందో అన్న ఆందోళన.
- పెద్ద ప్రమాదం జరిగేలోపు చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్.
- విద్యుత్ శాఖ, మున్సిపల్ అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు.



.**ప్రజా వాయిస్, మిర్యాలగూడ:**మిర్యాలగూడ గ్రేడ్–1 మున్సిపాలిటీ పరిధిలోని ఈడులగూడెం బైపాస్ వద్ద విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. అద్దంకి–నార్కెట్‌పల్లి–మేదరమెట్ల ప్రధాన రహదారిపై ఓ విద్యుత్ సిమెంట్ స్తంభం మొదట్లోనే విరిగిపోయి, పక్కనే ఉన్న మరో విద్యుత్ లైన్ వైర్ల సపోర్టుతో ప్రమాదకరంగా వేలాడుతూ ఒరిగిపోయింది. ఎప్పుడు కిందపడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.నిత్యం వేలాది వాహనాలు, ప్రయాణికులు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపై ఇలాంటి ప్రమాదకర పరిస్థితి నెలకొన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్య అధికారుల దృష్టికి వెళ్లినా ఇప్పటి వరకు ఎలాంటి శాశ్వత చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.విరిగిన స్తంభం బరువు మరో విద్యుత్ లైన్ వైర్లపై పడటంతో ఆ వైర్లు కూడా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. స్తంభం పూర్తిగా కూలిపోవడం లేదా విద్యుత్ వైర్లు తెగిపడితే రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, పాదచారులకు తీవ్ర ప్రమాదం పొంచి ఉంది. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టానికి దారితీసే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. విద్యుత్ శాఖ, మున్సిపల్ అధికారులు వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించి, విరిగిన స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ వైర్లను సురక్షితంగా అమర్చాలని డిమాండ్ చేస్తున్నారు.ఏదైనా పెద్ద అపశృతి జరిగే వరకు అధికారులు వేచి చూడకుండా.. ఇప్పటికైనా స్పందించి ప్రమాదాన్ని నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

# బ్లడ్ బ్యాంక్ ఎక్కడ..? కేసులు ఎందుకు..?


- పేదల వైద్య సమస్యలపై వినతిపత్రం
- బీజేపీ నేతలపై కేసులతో వివాదం
- కలెక్టర్ ఛాంబర్ లో ఏం జరిగింది..?
- తాము తప్పు చేశామంటే వీడియో ఫుటేజీ విడుదల చేయాలి
- బిజెపి రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి



**ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ సేవలు నిలిచిపోయాయని, ఆసుపత్రిలో నెలకొన్న ఇతర సమస్యలను పరిష్కరించి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడానికి వెళ్లిన తమపై, బీజేపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం దురదృష్టకరమని బీజేపీ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి అన్నారు.ఈ మేరకు ఆయన జిల్లా మాజీ అధ్యక్షుడు సదానంద రెడ్డి,నాయకులు, కార్యకర్తలతో కలిసి శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల బాధ్యతలో భాగమని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లిన సందర్భంలో తాము కలెక్టర్‌పై ఒత్తిడి చేసినట్లు లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు.జిల్లా పాలనాధికారిపై తమకు ఎంతో గౌరవం ఉందని, కలెక్టర్ ఛాంబర్‌లో తాము ఎలాంటి తప్పుడు పద్ధతిలో వ్యవహరించలేదని ఆయన స్పష్టం చేశారు. తాము తప్పు చేశామని అధికారులు భావిస్తే, ఆరోపణలకు సంబంధించిన సీసీ కెమెరా వీడియో ఫుటేజీని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల పేద, మధ్యతరగతి రోగులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు. ఆసుపత్రిలోని సమస్యలను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని కొప్పుల రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందే వరకు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు.

# పట్టపగలే రెండు ఇళ్లల్లో చోరీ.!

- రైతులు పొలాల్లో ఉండగా.. తాళాలు పగలగొట్టిన దొంగలు
- నాలుగున్నర తులాల బంగారం.. 47 తులాల వెండి అపహరణ
- వేలిముద్రలు సేకరించిన పోలీసులు.. గ్రామంలో భయాందోళన



ప్రజా వాయిస్,మిరుదొడ్డి:రైతులు పొలం పనుల్లో ఉండగా దొంగలు ఇళ్లపై కన్నేశారు. తాళాలు వేసి ఉన్న రెండు ఇళ్లలో చొరబడి బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం మిరుదొడ్డి మండలం ఆరేపల్లిలో గురువారం మిట్ట మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఒకేసారి రెండు ఇళ్లలో చోరీ జరగడంతో గ్రామంలో కలకలం రేగింది.ఆరేపల్లికి చెందిన లకిడి ప్రకాష్, వజ్జపల్లి నరసింహారావు ఉదయమే ఇళ్లకు తాళాలు వేసి వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లారు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళాలు పగలగొట్టి కనిపించాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలు తెరిచి ఉండటంతోపాటు దుస్తులు, సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి.

## విలువైన ఆభరణాలు మాయం..

లకిడి ప్రకాష్ ఇంట్లో మూడున్నర తులాల బంగారం, 25 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. వజ్జపల్లి నరసింహారావు ఇంట్లో తులం బంగారం, 22 తులాల వెండి అపహరణకు గురయ్యాయి. మొత్తం రెండు ఇళ్లలో నాలుగున్నర తులాల బంగారం, 47 తులాల వెండి చోరీ అయినట్లు బాధితులు తెలిపారు.

## పోలీసుల దర్యాప్తు

బాధితుల ఫిర్యాదు మేరకు మిరుదొడ్డి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వేలిముద్రల నిపుణుల సహాయంతో ఆధారాలను సేకరించారు. పట్టపగలే దొంగలు రెండు ఇళ్లను టార్గెట్ చేయడంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు.

# మంథనిలో 'చిల్లర' దొంగలు కావు... 'ఇంటి' దొంగలే!

- మార్కెట్ యార్డులో మోటర్ల చోరీ
- వంతెన వద్ద ఇనుప రాడ్ల మాయం
- పనిచేయని సీసీ కెమెరాలు
- సరిగా లేని నైట్ కాపలా
- పకడ్బందీ ప్లాన్ తో దొంగతనాలు
- దొంగల పేర్లు, సెక్షన్ల వివరాలపై పోలీసుల గోప్యత







**ప్రజా వాయిస్ మంథని** మంథని ప్రాంతంలో వరుస చోరీలు కలకలం రేపుతున్నాయి. ఒకవైపు రైతన్నలకు ఆసరాగా నిలవాల్సిన మార్కెట్ యార్డులో మోటార్లు మాయమవుతుంటే, మరోవైపు ప్రగతికి బాటలు వేసే జాతీయ రహదారి నిర్మాణ స్థలంలో టన్నుల కొద్దీ ఇనుప రాడ్లు గాల్లో కలిసి పోతున్నాయి. ఏదో ఒక రోజు చిల్లర దొంగతనం జరిగిందంటే సరి పెట్టుకోవచ్చు.. కానీ, నెలల తరబడి గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ అక్రమ దందాల వెనుక ఇంటి దొంగల హస్తమే ఉందనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

## మార్కెట్ యార్డులోనే చోరీల జాతర!

మంథని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం శుభ్రపరిచేందుకు రైతుల సౌకర్యార్థం 70 ప్యాడీ క్లీనింగ్ మోటార్లను ఏర్పాటు చేశారు. అయితే అందులో ఏకంగా 13 మోటార్లు చోరీకి గురికావడం గమనార్హం. గత నెల 26నే ఈ దొంగతనం జరిగినా, ఆలస్యంగా వెలుగులోకి రావడం అనేక అనుమానాలకు తావిస్తోంది. యార్డులో నైట్ వాచ్‌మెన్ ఉన్నప్పటికీ చోరీ ఎలా జరిగింది? అక్కడ సీసీ కెమెరాలు ఉన్నా అవి ఎందుకు పనిచేయడం లేదు? అనే ప్రశ్నలకు అధికారుల వద్ద సమాధానం లేదు. మార్కెట్ కమిటీ అధికారుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు గోదావరి నదిపై గ్రీన్ నేషనల్ హైవేలో భాగంగా పోతారం శివారులో మేగా కంపెనీ ఆధ్వర్యంలో జరుగుతున్న వంతెన నిర్మాణ పనుల వద్ద పెద్ద ఎత్తున ఇనుప రాడ్లు మాయమవుతున్నాయి. పోలీసుల కంటపడకుండా ఉండటానికి దొంగలు వేసిన స్కెచ్ చూసి అధికారులే విస్తుపోతున్నారు! లారీలు, వ్యాన్లు కాకుండా రాత్రి వేళల్లో ఎడ్ల బండ్లలో ఇనుప రాడ్లను పొలాల మీదుగా తరలించి, గ్రామాల్లోని ఇళ్ల పెరట్లో, పశువుల కొట్టాల్లో గోతులు తవ్వి పాతిపెడుతున్నారు. అవసరాన్ని బట్టి కొద్దికొద్దిగా తీసి స్క్రాప్ షాపులకు విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. అంత భద్రత ఉండే మార్కెట్ యార్డులోనూ, కోట్ల రూపాయల కాంట్రాక్టు పనులు జరిగే ప్రదేశాల్లోనూ వరుసగా చోరీలు జరుగుతున్నాయంటే లోపలి సిబ్బంది, కాపలాదారుల సహకారం లేకుండా సాధ్యం కాదనే చర్చ నడుస్తోంది. సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, స్టాక్ రిజిస్టర్లు సరిగా నిర్వహించకపోవడం, రాత్రి పూట కాపలా సరిగా లేకపోవడం దొంగలకు వరంలా మారింది.

## పోలీసులు పట్టుకున్నా... బయటకు రాని వివరాలు!

ఈ వ్యవహారంలో పోలీసులు ఇప్పటికే కొందరు అనుమానితులను, నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు దొరికిన దొంగల పేర్లను గానీ, వారిపై ఏ ఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారనే వివరాలను గానీ పోలీసులు అధికారికంగా బయట పెట్టకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. నిందితుల పేర్లను గోప్యంగా ఉంచడం వెనుక ఎవరి ఒత్తిళ్లు ఉన్నాయనే చర్చ స్థానికంగా తీవ్రంగా నడుస్తోంది.ఈ చోరీల వెనుక ఉన్న అసలైన ఇంటి దొంగలను సూత్రధారులను పూర్తిస్థాయిలో వెలికితీసి, దొరికిన దొంగల పేర్లను వెంటనే బహిర్గతం చేయాలని స్థానిక ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే నిర్మాణ స్థలాలు, ప్రభుత్వ ఆస్తుల వద్ద భద్రతను మరింత పటిష్టం చేయాలని కోరుతున్నారు.

# కానిస్టేబుల్.. ఎస్ఐ కొలువే మీ లక్ష్యమా

- నల్లగొండ పోలీస్ శాఖ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి
- 500 మంది అభ్యర్థులకు అవకాశం
- వసతి, భోజనం సైతం ఉచితం
- జిల్లా ఎస్పి.శరత్ చంద్రపవార్



**ప్రజా వాయిస్, నల్లగొండ:** ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ శుభవార్త అందించింది. పోలీస్ నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న అర్హులైన 500 మంది యువతి, యువకులను ఎంపిక చేసి ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ తెలిపారు. నల్లగొండ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించే శిక్షణలో రాత పరీక్ష సిలబస్‌తో పాటు ఫిజికల్ ట్రైనింగ్, మాక్ టెస్టులు, పరీక్షా విధానం, నిపుణుల మార్గదర్శకత్వం అందించనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కూడా కల్పించనున్నట్లు ఎస్పీ వెల్లడించారు.స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరయ్యే అభ్యర్థులు సెప్టెంబర్ 20, ఆదివారం ఉదయం 9 గంటలకు సంబంధిత కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. నల్లగొండ సబ్‌డివిజన్ అభ్యర్థులకు ఎన్.జి. కళాశాల, మిర్యాలగూడ సబ్‌డివిజన్ అభ్యర్థులకు మీనా ఇంజినీరింగ్ కళాశాల, దేవరకొండ సబ్‌డివిజన్ అభ్యర్థులకు డిండి క్రాస్‌రోడ్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్, మీనాక్షి సెంటర్స్‌లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పోలీస్ నియామకానికి దరఖాస్తు చేసుకున్న Part-I Application Form ప్రతిని వెంట తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పట్టుదలతో శిక్షణ పొంది పోలీస్ ఉద్యోగం సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు.


# రోడ్డు పూర్తికాకుంటే.. ఆమరణ దీక్ష.!

- గుండ్లపల్లి,పొత్తూర్ రోడ్డు పనులు పూర్తి చేయాలి
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే కవ్వంపల్లి
- పాత బిల్లులు చెల్లించకపోవడంతో పనులకు ముందుకురాని కాంట్రాక్టర్
- ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేర్చే వరకు పోరాటం: కవ్వంపల్లి

**ప్రజా వాయిస్,కరీంనగర్:**గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి,పొత్తూర్ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని, లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గంలోని రోడ్ల సమస్యలను ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.మానకొండూర్ నియోజకవర్గంలో పంచాయతీరాజ్, రోడ్లు–భవనాల శాఖల పరిధిలో పలు రోడ్డు నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. కాగితాలపై అనుమతులు మంజూరవుతున్నా.. వాటికి అనుగుణంగా నిధులు విడుదల కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదన్నారు. రోడ్ల నిర్మాణాలు పూర్తికాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

## పాత బిల్లులే కారణం

గుండ్లపల్లి,పొత్తూర్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదని కవ్వంపల్లి తెలిపారు. గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని అసెంబ్లీలో వివరించారు. పాత బిల్లులను వెంటనే చెల్లించి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.




## హామీ ఇచ్చా.. నిలబెట్టుకుంటా

గుండ్లపల్లి,పొత్తూర్ రోడ్డును పూర్తి చేయిస్తానని ఇప్పటికే స్థానిక ప్రజలకు హామీ ఇచ్చానని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపట్టక తప్పదని స్పష్టం చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సమస్యను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు.

# పాఠశాలలో బైబిల్ చదివిస్తున్నారా..?

- హిందీ ఉపాధ్యాయుడిపై విద్యార్థుల ఫిర్యాదులు
- మతమార్పిడికి ప్రోత్సహిస్తున్నారని ఆరోపణలు
- కొట్టడం, దూషిస్తున్నారంటూ విద్యార్థుల ఆవేదన
- పాఠశాలను సందర్శించిన బీజేపీ నాయకులు.. విచారణకు డిమాండ్



**ప్రజా వాయిస్,నవాబుపేట:**మండలంలోని పులిమామిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఫిర్యాదులు కలకలం రేపాయి. హిందీ ఉపాధ్యాయుడు తరగతి గదిలో బైబిల్ చదివిస్తున్నారని, క్రైస్తవ మతంలోకి మారాలని చెబుతున్నారని విద్యార్థులు ఆరోపించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. విద్యార్థులను దూషించడం, కొట్టడం వంటి ఆరోపణలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా విచారణ జరగాల్సి ఉంది.ఫిర్యాదుల నేపథ్యంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు దగ్గుల శ్రీహరిగౌడ్, బీజేపీ మాజీ జిల్లా కార్యదర్శి సారా జగన్ పాఠశాలను సందర్శించారు. ప్రధానోపాధ్యాయురాలితో మాట్లాడి, అనంతరం విద్యార్థులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో విద్యార్థులపై ఎలాంటి మతపరమైన ఒత్తిడి ఉండకూడదని, శారీరక శిక్షలు, దూషణలకు తావులేకుండా సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించాలని నాయకులు కోరారు. ఆరోపణలపై విద్యాశాఖ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని, ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు శివచంద్రరెడ్డి, వందేమాతరం, రమేష్, సుదర్శన్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.



# రైతులకు న్యాయం చేయాలి

- మిల్లర్లు, అధికారుల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి
- క్వింటాలుకు రూ.133,145 వరకు రైతులకు నష్టం
- డిఫాల్ట్ మిల్లులకు ధాన్యం కేటాయింపుపై సమాధానం చెప్పాలి
- రైతుల పక్షాన హైకోర్టులో రిట్ దాఖలు చేశాం: సురేష్ రెడ్డి

**ప్రజా వాయిస్,సుల్తానాబాద్:** రైతులకు అన్యాయం జరుగుతున్నా ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి ప్రశ్నించారు. సివిల్ సప్లై అధికారులు, రైస్ మిల్లర్లు, గోదాం నిర్వాహకుల అక్రమాల వల్ల రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు. శుక్రవారం సుల్తానాబాద్‌లోని యశోద నరహరి ఫంక్షన్‌హాల్‌లో మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ధాన్యం కొనుగోళ్లలో క్వింటాలుకు రూ.133 నుంచి రూ.145 వరకు రైతులకు నష్టం జరుగుతోందని, హమాలీ ఖర్చుల పేరుతో అదనంగా వసూళ్లు చేస్తున్నారని తెలిపారు. డిఫాల్ట్ మిల్లులకు ధాన్యం కేటాయించడంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన విజిలెన్స్ దాడులపై తీసుకున్న చర్యలను ఎమ్మెల్యే విజయరమణారావు వెల్లడించాలని కోరారు.రైస్‌మిల్లర్లు, గోదాముల అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేశామని సురేష్‌రెడ్డి తెలిపారు. రైతుల పక్షాన హైకోర్టులో రిట్ దాఖలు చేసినట్లు వెల్లడించారు. త్వరలో సంబంధిత శాఖలు, అధికారులకు నోటీసులు జారీ కానున్నాయని చెప్పారు. వానాకాలం సీజన్ నుంచి రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని ప్రకటించారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్‌యాదవ్, వేల్పుల రాజన్న పటేల్, బండారి లత, కోట నాగేశ్వర్, కొల్లూరి సంతోష్‌కుమార్, మెండే శంకరయ్య, మల్క భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా స్థలమా.. ప్రైవేట్ పార్కింగ్ అడ్డానా..?

- నార్సింగి హైట్స్ లో ఎంజీ కార్ల నిల్వపై దుమారం
- అనుమతులు ఎవరిచ్చారు అధికారులకు తెలిసే వ్యవహారం సాగుతోందా
- పార్క్ కోసం కేటాయించిన స్థలంలో వందలాది వాహనాలు
- స్థల వినియోగంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికుల డిమాండ్



**ప్రజా వాయిస్,రాజేంద్రనగర్:** ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలం.. ఇప్పుడు ప్రైవేట్ కార్ల పార్కింగ్‌కు అడ్డాగా మారిందా? నార్సింగి హైట్స్‌లో ఎంజీ మోటార్స్‌కు చెందిన కార్లు పెద్ద సంఖ్యలో నిలిపి ఉంచడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్రజల కోసం ఉద్దేశించిన స్థలంలో ప్రైవేట్ సంస్థ వాహనాలను నిల్వ చేసేందుకు అనుమతులు ఉన్నాయా ఉంటే ఎవరు ఇచ్చారు. ఏ నిబంధనల ప్రకారం అనుమతించారు అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.పార్క్ లేదా ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలమైతే.. ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు ఎలా వినియోగిస్తున్నారన్నదే స్థానికుల ప్రధాన ప్రశ్న. భూ కేటాయింపు ఉత్తర్వులు, స్థల వినియోగ అనుమతులు, పార్కింగ్‌కు సంబంధించిన ఒప్పందాలు ఏమైనా ఉన్నాయా ఉంటే వాటి వివరాలను అధికారులు వెల్లడించాలని వారు కోరుతున్నారు.

## అధికారులకు తెలిసేనా..?

ఎంజీ కార్లు పెద్ద సంఖ్యలో అక్కడ నిలిపి ఉంచుతున్నా సంబంధిత అధికారుల దృష్టికి ఈ వ్యవహారం రాలేదా లేక తెలిసే అనుమతి ఇచ్చారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేకుండా ప్రజా స్థలాన్ని ప్రైవేట్ సంస్థ వినియోగిస్తుంటే ఇంతకాలం అధికారులు ఎందుకు పట్టించుకోలేదన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి.

## క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలి

స్థలం వాస్తవంగా ఏ ప్రయోజనం కోసం కేటాయించబడింది ప్రస్తుతం ఏ ప్రయోజనానికి వినియోగిస్తున్నారు. అనే అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు ఉంటే వాటి వివరాలను బహిర్గతం చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తుంటే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలం ప్రజలకే అందుబాటులో ఉండేలా చూడాలని, ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌ను తొలగించి పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

# మంజూరై ఏళ్లు.. పనులకు మోక్షమెప్పుడో..?

- తారాసింగ్ భావి,ఆలేరు రహదారి అభివృద్ధిపై ఎదురుచూపులు
- 9.4 కి.మీ. రహదారి గుంతలమయం
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- రోడ్డు, బ్రిడ్జి పనులు వెంటనే చేపట్టాలని ఆర్ అండ్ బీ ఈఈకి వినతి
- ఆర్టీసీ బస్సు సర్వీసు పునరుద్ధరించాలని బీఆర్ ఎస్ యువ నాయకుడు అనిల్ కుమార్ డిమాండ్



**ప్రజా వాయిస్,మహబూబాబాద్:** మంజూరై ఏళ్లు గడుస్తున్నా తారాసింగ్ భావి,ఆలేరు స్టేజి వరకు రహదారి అభివృద్ధి పనులు, తారాసింగ్ భావి,రాజుల కొత్తపల్లి మధ్య రొడ్డం వద్ద నిర్మించాల్సిన బ్రిడ్జి పనులు ముందుకు సాగకపోవడంపై స్థానికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. 9.4 కిలోమీటర్ల మేర రహదారి గుంతలమయంగా మారడంతో వర్షాకాలంలో రాకపోకలు మరింత కష్టతరంగా మారాయి. ఈ నేపథ్యంలో పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ బీఆర్ఎస్ జిల్లా యువ నాయకుడు వరిపల్లి అనిల్‌కుమార్ ఆర్అండ్‌బీ ఈఈని కలిసి వినతిపత్రం అందజేశారు.తారాసింగ్ భావి, రాజులకొత్తపల్లి, చిన్నముప్పారం, ఆలేరు, నారాయణపురం తదితర గ్రామాలు, తండాల ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని అనిల్‌కుమార్ తెలిపారు. రహదారి అధ్వానంగా ఉండటంతో విద్యార్థులు, మహిళలు, రైతులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, అత్యవసర సమయాల్లో రోగులను ఆస్పత్రులకు తరలించడం కూడా ఇబ్బందిగా మారిందన్నారు.

## బస్సు సర్వీసూ బంద్ ..

గతంలో మహబూబాబాద్ నుంచి ఆలేరు మీదుగా రాజులకొత్తపల్లి వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేదని, రహదారి దుస్థితి కారణంగా ఆ సర్వీసు నిలిచిపోయిందని అనిల్‌కుమార్ పేర్కొన్నారు. దీంతో మారుమూల గ్రామాలు, తండాల ప్రజలు ప్రజా రవాణాకు దూరమయ్యారని తెలిపారు. రోడ్డు, బ్రిడ్జి పనులు పూర్తయితే ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యం మెరుగుపడి విద్య, వైద్యం, వ్యవసాయం, వ్యాపార రంగాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.ఇప్పటికే మంజూరైన పనులను జాప్యం చేయకుండా ప్రారంభించాలని ఆయన కోరారు. దీనిపై ఆర్అండ్‌బీ ఈఈ సానుకూలంగా స్పందించి నెల రోజుల్లో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు అనిల్‌కుమార్ తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు పనులు ప్రారంభించి నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు.

# పేట బస్టాండ్‌లో ఖాళీ జాగా కనిపిస్తే కబ్జానే!

- ప్రజా అవసరాల భూమిపై ఆక్రమణ దారుల కన్ను
- అనుమతులు లేకుండానే నిర్మాణాలా?
- ఏటీఎం ముందు ఆక్రమణ.. బస్టాండ్ ముందు దుకాణాల సముదాయం!
- చోద్యం చూస్తున్న గ్రామపంచాయతీ, ఆర్టీసీ యంత్రాంగం?
- బస్సుల రాకపోకలకు ఇబ్బందులు.. ప్రయాణికులకు తప్పని తిప్పలు






ప్రజా వాయిస్ పెద్ద శంకరంపేట, :పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ ఆవరణలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజా అవసరాలు, ప్రయాణికుల సౌకర్యాలు, బస్సుల రాకపోకలకు ఉపయోగపడాల్సిన ఖాళీ స్థలాలు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.. హద్దులు పెట్టడం, షెడ్లు వేయడం, నిర్మాణాలు చేపట్టడం పరిపాటిగా మారిందని ఆరోపిస్తున్నారు.అనుమతులు లేకుండానే నిర్మాణాలా?బస్టాండ్ పరిధిలో గ్రామపంచాయతీ అనుమతులు లేకుండానే కొన్ని నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్నాయా? ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలకు ఎవరు అనుమతిచ్చారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా నంబర్ వన్ ఏటీఎం ముందు భాగంలో ఆక్రమణకు గురైన స్థలం, బస్టాండ్ ముందు ప్రాంతంలో వెలిసిన దుకాణాల సముదాయంపై అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

## బస్టాండ్ కుంచించుకుపోతుందా?

బస్టాండ్ ఆవరణలోని స్థలాలు ఒక్కొక్కటిగా ఆక్రమణలకు గురవుతున్నట్లయితే భవిష్యత్తులో బస్సుల రాకపోకలు, పార్కింగ్, ప్రయాణికుల సౌకర్యాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే రద్దీ సమయాల్లో బస్సులు బస్టాండ్‌లోకి వచ్చి తిరిగి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కొన్ని సందర్భాల్లో రహదారిపైనే ప్రయాణికులను ఎక్కించుకోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.దీంతో ప్రధాన రహదారిపై రద్దీ పెరగడంతో పాటు ప్రయాణికుల భద్రతపై కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజల కోసం కేటాయించిన స్థలం తగ్గిపోతే.. భవిష్యత్తులో ప్రజలకే ఇబ్బందులు తప్పవని స్థానికులు అంటున్నారు.

## అధికారుల మౌనం ఎందుకు?

బస్టాండ్ పరిసరాల్లో ఆక్రమణలపై గ్రామపంచాయతీ, ఆర్టీసీ అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు వచ్చినప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రభుత్వ స్థలాలను గుర్తించి, హద్దులు ఏర్పాటు చేయాల్సిన అధికారులు కేవలం కంటి తుడుపు చర్యలకే పరిమితమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.అధికారుల పర్యవేక్షణ లోపిస్తే ఆక్రమణలు మరింత విస్తరించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఒక్క బస్టాండ్ స్థలానికి సంబంధించిన సమస్య కాదని.. ప్రజా ఆస్తుల పరిరక్షణకు సంబంధించిన అంశమని వారు పేర్కొంటున్నారు.హద్దులు నిర్ణయించి.. ఆక్రమణలు తొలగించాలిబస్టాండ్ పరిధిలోని మొత్తం ప్రభుత్వ భూమిని అధికారులు సర్వే చేసి, అధికారిక హద్దులను స్పష్టంగా ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్మించిన నిర్మాణాలు, ఆక్రమణలకు గురైన స్థలాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బస్టాండ్ భూములను భవిష్యత్ అవసరాల కోసం రక్షించడంతో పాటు, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్సుల రాకపోకలకు తగిన స్థలం అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెద్ద శంకరంపేట బస్టాండ్ పరిధిలో సమగ్ర స్థల పరిశీలన నిర్వహించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు స్పందించకపోతే సమస్యను ఉన్నతస్థాయికి తీసుకెళ్లి ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతామని స్థానిక యువత, ప్రయాణికులు హెచ్చరిస్తున్నారు.

# బీఆర్ఎస్‌లోకి బీఎస్పీ నేతలు

- కమ్మదనంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సమక్షంలో చేరికలు
- ఉపసర్పంచ్ జగన్ , వార్డు సభ్యుడు మహేష్ ఆధ్వర్యంలో పలువురు చేరిక
- కార్యకర్తలకు అండగా ఉంటాం: ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి
- కేసీఆర్ నాయకత్వాన్ని విశ్వసించే పార్టీలో చేరాం: కొత్తగా చేరిన నేతలు

**ప్రజా వాయిస్,షాద్‌నగర్:** షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామానికి చెందిన బీఎస్పీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి సమక్షంలో ఉపసర్పంచ్ జగన్, వార్డు సభ్యుడు పి.మహేష్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు గులాబీ కండువాలు కప్పుకున్నారు. నవీన్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వం, బీఆర్ఎస్ సిద్ధాంతాలను విశ్వసించి పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని చెప్పారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, కమ్మదనం గ్రామ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు.పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన సేవా కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు.ఉపసర్పంచ్ జగన్, వార్డు సభ్యుడు పి.మహేష్‌తో పాటు కె.యాదయ్య, ఇ.కేశవ్, కె.రమేష్, ఎస్.వంశీ, జె.హరి, ఇ.శివకుమార్, ఇ.యాదగిరి, కె.నవీన్, టి.అభిషేక్, పి.వర్ధన్, పి.మున్నా, జె.లోకేష్, పి.విజయ్, పి.కుశ, పి.బన్ని, బి.చందు, కె.శ్రీశైలం తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో కమ్మదనం సర్పంచ్ లత కిరణ్‌కుమార్‌గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు శివగళ్ల రాజు, రాఘవేందర్‌రెడ్డి, శ్రీశైలం, శివగళ్ల వెంకట్, చెన్నయ్యగౌడ్, బాల్‌రాజ్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.






# కలెక్టరేట్ వేదికగా గళమెత్తిన కలం యోధులు

- తొలి రోజు జర్నలిస్టు రిలే దీక్షలతో దద్దరిల్లిన నల్లగొండ కలెక్టరేట్
- పెద్ద ఎత్తున దీక్షలకు తరలివచ్చిన జర్నలిస్టులు
- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో పాటు పలు పార్టీల నేతలు సంఘీభావం
- దీక్షలకు హాజరైన టీయూడబ్ల్యూజే (iju) రాష్ట్ర నాయకులు
- 19వ తేదీన రెండవ రోజు కొనసాగనున్న రిలే దీక్షలు

**ప్రజా వాయిస్,నల్లగొండ.**నల్లగొండ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని టీయూడబ్ల్యూజే(ఐజేయు ) నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ప్రారంభమైన తొలి రోజు దీక్షలకు భారీ ఎత్తున జర్నలిస్టులు తరలివచ్చారు. తొలిరోజు దీక్షలు కనీవిని ఎరగని రీతిలో విజయవంతం కావడం జరిగింది. ఈ దీక్షలకు ఎమ్మెల్సీ, సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, నల్గొండ పార్లమెంటు టిడిపి కన్వీనర్ కసిరెడ్డి శేఖర్ రెడ్డి, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు రజియుద్దీన్, 36వ డివిజన్ కార్పొరేటర్ గంటల అనంతరెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి సలీం తో పాటు పలువురు నేతలు సంఘీభావం తెలిపారు. అదేవిధంగా నిడమనూరు, నార్కెట్పల్లి , మాడుగుల పల్లి, కనగల్ మండలాల నుంచి యూనియన్ నేతలు వచ్చి సంఘీభావం తెలిపారు. యూనియన్ రాష్ట్ర నాయకులు పి.ప్రభాకర్ రెడ్డి, యూసఫ్ బాబు దీక్షలకు హాజరై సంఘీభావం తెలిపారు. 19వ తేదీన కొనసాగనున్న దీక్షలు... 19వ తేదీన శనివారం నాడు ఉదయం 10 గంటలకు దీక్షలు ప్రారంభమవుతాయని, రెండో రోజు కూడా పెద్ద ఎత్తున తరలి రావాలని టి యు డబ్ల్యూజె జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి తెలిపారు. రెండవ రోజు కూడా ప్రతిపక్ష iపార్టీలకు చెందిన నేతలతో పాటు, అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరవుతారని తెలిపారు. తొలి రోజు దీక్షలను విజయవంతం చేసిన ప్రతి జర్నలిస్టుకు యూనియన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఈ దీక్షలో జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి,ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి, నాయకులు జక్కల పరమేష్,ఎస్కే సలీం, దోటి శ్రీనివాస్,జిల్లా యాదయ్య,అశ్వక్, మదనాచారి, కత్తుల యాదగిరి,వంగల శ్రీనివాస్ రెడ్డి,చింత యాదగిరి,సయ్యద్, తెలగమల్ల దశరథ, తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

# రోగులకు అందిస్తున్న వైద్య సేవలను నిరంతరం పర్యవేక్షించాలి

- ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి
- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ముత్యంపేట ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ప్రజా వాయిస్ కామారెడ్డి/**వైద్య సేవలతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలనీ కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు.దోమకొండ మండలం ముత్యంపేట గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల తీరుపై జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని వైద్య సిబ్బందికి సూచించారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ సకాలంలో అవసరమైన వైద్య సేవలు, మందులు అందేలా సిబ్బంది బాధ్యతతో పనిచేయాలి" అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు.ఆస్పత్రి ప్రాంగణం, స్టోర్ రూమ్‌ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. వైద్య సేవలు అందించే ప్రదేశంలో పరిశుభ్రత అత్యంత ముఖ్యమైనది. ఆస్పత్రి పరిసరాలు ఆహ్లాదకరంగా స్వచ్ఛంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి అని సూచించారు.ఔషధాల నిల్వలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రోగులకు సకాలంలో మందులు పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు.ప్రజలు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలపై నమ్మకంతో వచ్చేలా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలి. ప్రతి రోగితో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చూడాలి" అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి, డిఎం అండ్ హెచ్ ఓ వెంకట్, సర్పంచ్ స్థానిక వైద్య అధికారులు, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల కరెంటు.. వ్యక్తిగత వినియోగానికా?

- మోడల్ స్కూల్ లో విద్యుత్ వినియోగంపై ఆరోపణలు
- ఉపాధ్యాయుడి కారు ఛార్జింగ్ చేస్తున్న దృశ్యాలు వైరల్

**పెద్దశంకరంపేట, ప్రజా వాయిస్:**ప్రభుత్వ విద్యాసంస్థల నిర్వహణ కోసం వినియోగించే విద్యుత్‌ను వ్యక్తిగత అవసరాలకు ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు పెద్దశంకరంపేట మోడల్ స్కూల్‌లో చర్చనీయాంశంగా మారాయి. పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు తన వ్యక్తిగత కారును పాఠశాల విద్యుత్ సరఫరాతో ఛార్జింగ్ చేస్తున్న దృశ్యాలు స్థానికంగా చర్చకు దారితీశాయి.ప్రభుత్వ నిధులతో నిర్వహించే విద్యాసంస్థల్లో విద్యుత్ వినియోగం విద్యార్థులు, పాఠశాల అవసరాలకే పరిమితం కావాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వ్యక్తిగత వాహనాన్ని పాఠశాల విద్యుత్‌తో ఛార్జింగ్ చేయడం నిబంధనలకు అనుగుణమేనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.అధికారుల విచారణకు డిమాండ్‌ఈ వ్యవహారంపై సంబంధిత విద్యాశాఖ అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి, విద్యుత్ వినియోగానికి సంబంధించిన వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో అపోహలకు తెరదించాలని వారు కోరుతున్నారు.






# అర్హత లేకున్నా వైద్యం.. బోన్ సెట్టింగ్ కేంద్రం సీజ్

- హుస్నాబాద్ లో ధన్వంతరి హాస్పిటల్ పై మెడికల్ అధికారుల ఆకస్మిక తనిఖీలు
- వైద్య విద్యార్హతలు, అనుమతులు లేవని గుర్తింపు
- నిర్వాహకుడు అంకం శ్రీనివాస్ పై పోలీసులకు ఫిర్యాదు
- కేసు నమోదు.. తదుపరి చట్టపరమైన చర్యలకు అమలు

**ప్రజా వాయిస్,హుస్నాబాద్:** పట్టణంలో అర్హతలు లేకుండా బోన్ సెట్టింగ్ నిర్వహిస్తున్న కేంద్రంపై వైద్యాధికారులు కొరడా ఝుళిపించారు. ధన్వంతరి హాస్పిటల్ పేరుతో అంకం శ్రీనివాస్ నిర్వహిస్తున్న కేంద్రాన్ని మెడికల్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తగిన విద్యార్హతలు, వైద్య అనుమతులు లేకుండానే చికిత్సలు నిర్వహిస్తున్నట్లు గుర్తించి కేంద్రాన్ని అక్కడికక్కడే సీజ్ చేశారు.ఈ ఘటనపై మెడికల్ అధికారి పొన్న శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అంకం శ్రీనివాస్‌పై హుస్నాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు నిర్వహించిన వ్యవహారంపై తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# కక్షల కొలిమిలో ఫరీద్‌పేట్ పంచాయతీ

- సర్పంచ్, ఉపసర్పంచ్ పై వార్డు సభ్యురాలి ఆరోపణలు
- ఎన్నికైన రెండు నెలల నుంచే వేధింపులు మొదలయ్యాయని వెల్లడి
- అసభ్య పదజాలం, బెదిరింపులతో కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపణ
- అవినీతి వ్యవహారం బయటపెట్టినందుకే కక్ష సాధిస్తున్నారని ప్రత్యూష ఆరోపణ

**ప్రజా వాయిస్,దోమకొండ:** ఫరీద్‌పేట్ గ్రామ పంచాయతీలో రాజకీయ విభేదాలు ముదిరాయి. సర్పంచ్ జీడిపల్లి నరసింహారెడ్డి, ఉపసర్పంచ్ కోల బాలగౌడ్ తనపై, తన కుటుంబంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని 9వ వార్డు సభ్యురాలు దేవోల్ల ప్రత్యూష రాములు ఆరోపించారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎస్సీ మహిళా రిజర్వేషన్‌లో 9వ వార్డు సభ్యురాలిగా ఎన్నికైన రెండు నెలల నుంచే వ్యక్తిగత కక్షలతో తమ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు.గ్రామంలో తనను అసభ్య పదజాలంతో దూషిస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నారని ప్రత్యూష ఆరోపించారు. సర్పంచ్‌కు సంబంధించిన అవినీతి వ్యవహారాన్ని తన భర్త రాములు బయటపెట్టడంతోనే తమపై కక్ష పెంచుకున్నారని తెలిపారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తాన్ని సర్పంచ్ చెల్లించినట్లు ఆమె పేర్కొన్నారు. అనంతరం సీఎం సచివాలయం, జిల్లా కలెక్టర్ ప్రజావాణి, ఎస్సీ కమిషన్ తదితర వేదికల్లో తమపై ఫిర్యాదులు చేయించారని ఆరోపించారు.ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదు మాచారెడ్డి పోలీస్‌స్టేషన్‌కు చేరిన సమయంలో కంఠం సిద్ధ రాములు తానే సీఎం సచివాలయంలో ఫిర్యాదు చేసినట్లు అంగీకరించారని ప్రత్యూష తెలిపారు. గతంలో సంబంధిత వ్యక్తిపై కేసులు, బైండోవర్ చర్యలు జరిగినప్పటికీ ప్రవర్తనలో మార్పు కనిపించలేదని ఆరోపించారు. ఇకపై తమ కుటుంబం జోలికి రాకుండా సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు సంబంధిత ప్రభుత్వ ఉద్యోగి బాండ్ పేపర్‌పై రాసివ్వాలని ఆమె డిమాండ్ చేశారు.







# బూడిద లారీల బరితెగింపు ప్రయాణికుల గగ్గోలు..!

- కలెక్టరేట్ ముందే ఓవర్ లోడ్ దందా.. గుట్టలుగా బూడిద తరలింపు
- వెనుక వచ్చే వాహనదారులపై దుమ్ము దాడి.. కళ్లలోకి దూసుకొస్తున్న బూడిద
- ఫిర్యాదులు చేసినా మారని పరిస్థితి.. ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది.?
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న లారీలపై తక్షణమే కొరడా ఝుళిపించాలంటున్న ప్రజలు

**ప్రజా వాయిస్, పాల్వంచ:** పాల్వంచలో బూడిద లారీల దూకుడు ప్రయాణికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కేటీపీఎస్ నుంచి నిత్యం వందలాది లారీలు బూడిదను తరలిస్తుండగా.. వాటిలో కొన్ని లారీలు ఓవర్‌లోడ్‌తో గుట్టలుగా బూడిదను నింపుకుని రాకపోకలు సాగిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుటి రహదారిపైనే ఈ పరిస్థితి కనిపిస్తున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.లారీలు వేగంగా వెళ్లిన సమయంలో బూడిద గాలిలోకి ఎగిసి వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారులు, ఆటో ప్రయాణికులు, పాదచారులపై పడుతోందని చెబుతున్నారు. కళ్లలో బూడిద పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఒక్కసారిగా చూపు మందగిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బూడిదను కప్పే పట్టాలు సక్రమంగా లేకపోవడం సమస్యను మరింత తీవ్రం చేస్తోందని అంటున్నారు.

## కలెక్టరేట్ ఎదుటే.. కనిపించదా.?

జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుటి రహదారి మీదుగానే నిత్యం వందలాది బూడిద లారీలు వెళ్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఓవర్‌లోడ్ లారీలు, బూడిద రవాణా విధానంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే పరిస్థితి కొనసాగితే ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా.. ముందే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా..

బూడిద లారీల సమస్యపై గత సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ అంకిత్‌కు పలువురు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రహదారిపై పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఇక ఆలస్యం వద్దు

ప్రయాణికుల భద్రత దృష్ట్యా రవాణా శాఖ అధికారులు వెంటనే ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. లారీల ఓవర్‌లోడ్, బూడిదను కప్పే విధానం, వాహనాల వేగం తదితర అంశాలను పరిశీలించి నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కేటీపీఎస్ యాజమాన్యం కూడా బూడిద రవాణా సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.ప్రమాదం జరిగే వరకు వేచి చూడొద్దు.. ఇప్పుడే స్పందించండి అంటూ ద్విచక్ర వాహనదారులు, స్థానిక ప్రయాణికులు జిల్లా యంత్రాంగాన్ని కోరుతున్నారు.

# బీసీ రాజ్యాధికారమే లక్ష్యం..!

- శంషాబాద్ కు చేరిన మల్లన్న పాదయాత్ర
- జియాగూడ నుంచి అత్తాపూర్ .. ఆరాంఘర్ మీదుగా కొనసాగిన యాత్ర
- దారిపొడవునా ప్రజలతో మమేకం.. సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్సీ
- జీహెచ్ ఎంసీ కార్మికుల గోడు.. ఏజెన్సీ విధానంపై పోరాడతానని హామీ









**ప్రజా వాయిస్,శంషాబాద్:** బీసీల రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాధికార అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపట్టిన 'బీసీ రాజ్యాధికార యాత్ర' శంషాబాద్‌కు చేరుకుంది. రెండో రోజు శుక్రవారం జియాగూడ నుంచి ప్రారంభమైన పాదయాత్ర రాజేంద్రనగర్, అత్తాపూర్, డైరీ ఫార్మ్, శివరాంపల్లి, ఆరాంఘర్, గగన్‌పహాడ్ మీదుగా శంషాబాద్ వరకు సాగింది. పార్టీ శ్రేణులతో పాటు పలువురు స్థానికులు యాత్రలో పాల్గొన్నారు.దారిపొడవునా ప్రజలను, చిరు వ్యాపారులను పలకరిస్తూ వారి సమస్యలను మల్లన్న అడిగి తెలుసుకున్నారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం తదితర అంశాలను ప్రస్తావిస్తూ ప్రజలతో మాట్లాడారు. బీసీల రాజకీయ భాగస్వామ్యం పెరగాల్సిన అవసరాన్ని వివరిస్తూ యాత్రను కొనసాగించారు.

## కార్మికుల గోడు విన్న మల్లన్న

శంషాబాద్ పరిసరాల్లో యాత్ర కొనసాగుతున్న సమయంలో కొందరు జీహెచ్‌ఎంసీ కార్మికులు మల్లన్నను కలిసి తమ సమస్యలను వివరించారు. ఏజెన్సీ విధానం కారణంగా తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వానికి పలుమార్లు తమ సమస్యలను వివరించినా పరిష్కారం కాలేదని తెలిపారు.కార్మికుల సమస్యలను విన్న మల్లన్న.. ఏజెన్సీ విధానంపై పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు, హక్కులు దక్కేలా వారి తరఫున నిలబడతానని తెలిపారు.

## నందిగామ వైపు పాదయాత్ర

యాత్ర మూడో రోజు శనివారం ఉదయం శంషాబాద్ నుంచి ప్రారంభం కానుంది. పాలమాకుల, తిమ్మాపూర్ మీదుగా కొత్తూరు, నందిగామ ప్రాంతాలకు పాదయాత్ర కొనసాగనుంది. మార్గమధ్యంలోని ప్రధాన కూడళ్ల వద్ద కార్నర్ సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. శనివారం రాత్రి నందిగామలో మల్లన్న బస చేయనున్నారు.





# బస్టాండ్‌లో కనిపించి.. గుట్టల్లో శవమై


- ఇంటి నుంచి వెళ్లిన రెండు రోజులకే యువకుడి అనుమానాస్పద మృతి
- జనగామ బస్టాండ్ లో చివరిసారిగా కనిపించిన ప్రేమ్ కుమార్
- కోలుకొండ గుట్టల్లో కుళ్లిన స్థితిలో మృతదేహం
- ఆత్మహత్యా.? హత్యా.? ఇతర కారణాలా.?
- పోలీసుల దర్యాప్తు ముమ్మరం

**ప్రజా వాయిస్,పాలకుర్తి:** ఇంటి నుంచి వెళ్లిపోయిన యువకుడు రెండు రోజులకే గుట్టల్లో శవమై కనిపించిన ఘటన జనగామ జిల్లాలో కలకలం రేపింది. పాలకుర్తి మండలం బిక్యా నాయక్‌తండాకు చెందిన ప్రేమ్‌కుమార్ (25) మృతదేహం దేవరుప్పల మండలం కోలుకొండ గుట్టల్లో లభ్యమైంది.కుటుంబ కలహాల నేపథ్యంలో ప్రేమ్‌కుమార్ రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత జనగామ బస్టాండ్ పరిసరాల్లో కనిపించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇంతలోనే కోలుకొండ గుట్టల్లో అతడు విగతజీవిగా కనిపించడం పలు అనుమానాలకు తావిస్తోంది.మృతదేహం కుళ్లిపోయి, ముఖం నల్లగా మారి దుర్వాసన వస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ప్రేమ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎవరైనా హత్య చేసి అక్కడ పడేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ అనుమానాలపై అధికారిక నిర్ధారణ లేదు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రేమ్‌కుమార్ చివరిసారిగా ఎక్కడ కనిపించాడు కోలుకొండ గుట్టలకు ఎలా చేరుకున్నాడు అతడి మృతికి అసలు కారణమేంటి అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, దర్యాప్తు వివరాలు వెలువడితేనే మిస్టరీ వీడనుంది.

# ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవం సాక్షిగా నీటి వృథా!

- కంట్రోలర్ లేదట.. మరి నీటి వృథాకు ఎవరు బాధ్యులు?
- పంచాయతీ కార్యాలయం పక్కనే వేల లీటర్ల నీరు నేలపాలు!
- రోడ్డుపై తాగునీటి ప్రవాహం
- అధికారుల మౌనం వెనుక రాజకీయ ఒత్తిళ్లా?





**ప్రజా వాయిస్ ఖమ్మం:** ఒకవైపు ప్రపంచం మొత్తం నీటి పర్యవేక్షణ దినం జరుపుకుంటూ ప్రతీ చుక్క నీటిని సంరక్షించుకోవాలని, భావి తరాలకు జల భద్రత కల్పించాలని ఘనంగా నినదిస్తోంది. కానీ, ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం, కోనాయిగూడెం గ్రామంలో మాత్రం ఇందుకు పూర్తిగా భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. సాక్షాత్తు అధికారుల కళ్ల ముందే, గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కనే జల సంపద రోడ్డుపాలవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.గ్రామస్తులకు రక్షిత మంచినీరు అందించాల్సిన వ్యవస్థలు పూర్తిగా అటకెక్కాయి. ఉదయం 11 గంటల సమయం దాటినప్పటికీ నీటి పైపులైన్ నుంచి నీరు విచ్చలవిడిగా, ఎటువంటి నియంత్రణ లేకుండా కిందికి ప్రవహిస్తూ చుట్టూ ఉన్న ప్రాంతాన్ని బురదమయం చేస్తోంది. రోజూ వేల లీటర్ల విలువైన నీరు వృథాగా పోతున్నా, ఆ దారినపోయే అధికారులు సిబ్బంది కనీసం కన్నెత్తి కూడా చూడకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.గ్రామంలో జరుగుతున్న ఈ నీటి వృథాపై గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా ఆయన చెప్పిన సమాధానం మరింత విస్తుపోయేలా ఉంది. పంపునకు ఎటువంటి నియంత్రణ (కంట్రోల్) లేదని, ఒకవేళ ప్రెజర్ కంట్రోల్ చేస్తే పైపులు పగిలిపోతాయని ఆయన బాధ్యతారహితంగా బదులిచ్చారు. సాంకేతిక లోపాలను సరిదిద్ది, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అధికారే ఇలా చేతులెత్తేయడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు.ప్రతి చుక్క అమూల్యమైన ఈ కాలంలో, ప్రజాధనంతో నడిచే మంచినీటి పథకాలు ఇలా రోడ్డుపాలవుతుంటే పంచాయతీ పాలకులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు తక్షణమే స్పందించి, కోనాయిగూడెం నీటి వృథాకు కారణమవుతున్న లీకేజీలు పైపులైన్ సమస్యలను పరిష్కరించాలని... బాధ్యతారహితంగా వ్యవహరించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# బేరం లేని వ్యాపారం

- ఆస్పత్రుల్లో ధరల దోపిడీ!
- రూ.11ల ఐవీ సెట్ ...రూ.325,రూ.6ల సిరంజి...రూ.57,రూ.22ల ఐవీ కెన్యూలా...రూ.424లకు విక్రయం
- మహారాష్ట్రలో బయటపడ్డ ధరల దోపిడీ
- తెలంగాణలోనూ ఇదే పరిస్థితా?




**ప్రజా వాయిస్, హుజూర్ నగర్,** సెప్టెంబర్ 18ఆపద సమయంలో ఆస్పత్రికి పరుగెత్తే సామాన్యుడికి మందులు, వైద్య పరికరాల ధరలపై బేరమాడే అవకాశం ఉండదు.ఏ వస్తువుకు ఎంత ధర అనే అవగాహన కూడా లేకపోవడంతో ఆస్పత్రి యాజమాన్యం చెప్పిన ధరకే చెల్లించాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇదే కొన్ని ప్రైవేటు ఆస్పత్రులకు వరంగా మారుతోందన్న ఆరోపణలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. కందిపప్పు, పెసరపప్పు కొనుగోలు చేసే సమయంలో ధరలు పరిశీలించే వినియోగదారుడు.. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే వైద్య పరికరాల ధరలను మాత్రం తెలుసుకునే అవకాశం ఉండదు.ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ తుకారాం ముండే ఒక ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి మెడికల్ బిల్లులను పరిశీలించగా పరికరాల ధరల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. సెలైన్ పెట్టేందుకు ఉపయోగించే ఐవీ సెట్ అసలు ధర సుమారు రూ.11 కాగా రూ.325కు, రూ.6 విలువైన సిరంజిని రూ.57కు, రూ.22 విలువైన ఐవీ కెన్యూలాను రూ.424కు, రూ.45 విలువైన నెబులైజర్ మాస్క్ కిట్‌ను రూ.650కు విక్రయించినట్లు గుర్తించినట్లు పేర్కొనబడింది.ధరల్లో ఈ స్థాయి వ్యత్యాసాలను గమనించిన కమిషనర్.. అత్యవసర సమయంలో రోగుల బంధువులకు ధరలపై బేరమాడే అవకాశం ఉండదని పేర్కొంటూ దీనిపై చర్యలు అవసరమని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. తక్కువ ధరకు లభించే వైద్య పరికరాలపై అధిక మార్జిన్లను నియంత్రించేందుకు డ్రగ్స్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ 2013 పరిధిలోకి వైద్య పరికరాలను తీసుకురావడం, వాటికి ధరల పరిమితి విధించడం వంటి చర్యలను పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించినట్లు తెలుస్తోంది.

## తెలంగాణలో పరిస్థితి ఏమిటి?

మహారాష్ట్రలో బయటపడిన ఈ ధరల వ్యత్యాసాలు దేశవ్యాప్తంగా ప్రైవేటు వైద్యరంగంలో వైద్య పరికరాల ధరలపై మరోసారి చర్చకు దారితీస్తున్నాయి. తెలంగాణలోని ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ ఐవీ సెట్లు, సిరంజీలు, కెన్యూలాలు, నెబులైజర్ కిట్లు తదితర వైద్య పరికరాలను అసలు ధరల కంటే ఎంత అధికంగా విక్రయిస్తున్నారు? వాటి కొనుగోలు ధరలు, రోగుల నుంచి వసూలు చేస్తున్న ధరల మధ్య వ్యత్యాసంపై సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహిస్తే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అత్యవసర వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే సామాన్యుడిపై పడుతున్న అదనపు ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు వైద్య పరికరాల ధరల పారదర్శకత, బిల్లుల్లో స్పష్టత, నియంత్రణ వ్యవస్థపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# పాఠశాలల్లో అల్పాహార పథకం అద్భుతం

- విద్యార్థులకు మేలైన పోషకాహారం, చదువుపై ఏకాగ్రత
- కమాన్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో సర్ప్రైజ్ తనిఖీ చేసిన కలెక్టర్ కోయ శ్రీహర్ష
- పిల్లలతో కలసి టిఫిన్ చేసిన జిల్లా అధిపతి





**ప్రజా వాయిస్ కమాన్‌పూర్**

పాఠశాల విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ చదువుపై పూర్తిస్థాయి ఏకాగ్రత సాధించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత అల్పాహార కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన కమాన్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న అల్పాహారం నాణ్యతను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులతో కలిసి కింద కూర్చుని టిఫిన్ చేశారు. అనంతరం అల్పాహారం రుచి, నాణ్యత, పరిమాణం, రోజూ పాలు లేదా రాగిజావ సరిగా అందుతున్నాయా లేదా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉదయాన్నే పాఠశాలకు వచ్చే పిల్లలకు పోషకాహారం లభించడం వల్ల ఆకలి బాధ లేకుండా అభ్యసన సామర్థ్యం పెరుగుతుందన్నారు. 'హరే రామ హరే కృష్ణ' ట్రస్ట్ సమన్వయంతో అందిస్తున్న ఈ కార్యక్రమంలో నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యకు అనుకూలమైన వాతావరణం కల్పించడంలో ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ?ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మహబూబాబాద్ ఐటీఐ కళాశాలల్లో 4వ దశ వాక్-ఇన్ ఆన్‌లైన్ ప్రవేశాల

**ప్రభుత్వ ఏ.టీ.ఐ/ఏ.టీ.సీ ప్రిన్సిపాల్ శ్రీ బి. ఓంకార్**

**మహబూబాబాద్ ప్రజా వాయిస్...**

మహబూబాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఏ.టీ.ఐ/ఏ.టీ.సీ మరియు అన్ని ప్రైవేట్ ఐటీఐలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను వివిధ ట్రేడ్లలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి 4వ దశ వాక్-ఇన్ ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఏ.టీ.ఐ/ఏ.టీ.సీ ప్రిన్సిపాల్ బి. ఓంకార్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. తేదీ: 16-09-2026 నుండి 22-09-2026 వరకు (చివరి రోజు మధ్యాహ్నం 1:00 గంటల వరకు మాత్రమే ఆన్‌లైన్ దరఖాస్తు నమోదుకు అవకాశం ఉంటుందని,10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు సంబంధిత ట్రేడ్లలో ప్రవేశం పొందవచ్చునని అన్నారు.అభ్యర్థులు తేదీ 01-08-2026 నాటికి కనీసం 14 సంవత్సరాల వయస్సు పూర్తి చేసి ఉండాలని అన్నారు. అభ్యర్థులు ముందుగా ww.వశ్రీఖఅ-స్త్రుఖు.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ మరియు దరఖాస్తు చేసుకోవాలని, నింపిన దరఖాస్తు ఫారంతో పాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకుని సంబంధిత ×ు×కి హాజరు కావాలని అన్నారు. ప్రతిరోజూ ఉదయం 11:00 గంటలోపు సంబంధిత ఐటీఐలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను మాత్రమే అదే రోజు జరిగే వాక్-ఇన్ అడ్మిషన్‌కు అర్హులుగా పరిగణిస్తారన్నారు.ఖాళీగా ఉన్న సీట్ల వివరాలను రోజువారీగా వెబ్‌సైట్/కళాశాలలో అప్‌డేట్ చేయడం జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమకు ఆసక్తి ఉన్న ట్రేడ్లలో ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా కోరారు.



# ఈ నెల 28, 29, 30 తేదీల్లో హన్మకొండలో ఏఐఎస్‌ఎఫ్ 90వ వారోత్సవాలు

- గోడ ప్రతులను ఆవిష్కరించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కిషన్ ఓజా
- పోస్టర్ ఆవిష్కరణలో మాట్లాడిన ఏఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

**ప్రజా వాయిస్ గోదావరిఖని**

అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 28, 29, 30 తేదీలలో హన్మకొండలో నిర్వహించనున్న ఏఐఎస్‌ఎఫ్ 90వ వారోత్సవాలను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కిషన్ ఓజాతో కలిసి వారోత్సవాల గోడ ప్రతులను ఆవిష్కరించారు. ?ఈ సందర్భంగా రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ.. భారతదేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్‌ఎఫ్ అని గుర్తుచేశారు. స్వాతంత్ర్యానికి పూర్వమే, 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్‌లోని లక్నో నగరంలో బెనారస్ యూనివర్సిటీ వేదికగా ఈ సంఘం ఆవిర్భవించిందన్నారు. నాటి నుంచి నేటి వరకు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు విద్యార్థుల హక్కుల సాధన, ప్రభుత్వ విద్య పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం ఏఐఎస్‌ఎఫ్ నిరంతరం పోరాడుతోందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని, గురుకుల విద్యార్థులకు సొంత భవనాలు కేటాయించాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి విద్యార్థులకు అండ ఏఐఎస్‌ఎఫ్ జెండా ఎల్లప్పుడూ ముందుంటాయని, హన్మకొండలో జరిగే 90వ వారోత్సవాలకు విద్యార్థి లోకం పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ?ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ గర్ల్స్ జిల్లా కన్వీనర్ గుండ్ల లక్ష్మీప్రసన్న, నాయకులు అభిషేక్, ఆరే జశ్వంత్, చైత్ర, సజన్, మహిన్, ఆరిఫ్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.




# విఘ్నేశ్వరుడి చెంత మహిళల భక్తి పర్వం

## విఘ్నేశ్వర కాలనీలో సామూహిక కుంకుమార్చనకు విశేష స్పందన

## వినాయకుడిని కొలిచి కుటుంబ క్షేమాన్ని కోరిన మహిళలు

**ప్రజా వాయిస్ // రాజేంద్రనగర్:** బండ్లగూడ జాగీర్ విఘ్నేశ్వర కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా వినాయక మండపం వద్ద నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథుడిని దర్శించుకున్నారు. కుటుంబాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సౌభాగ్యం నెలకొనాలని ప్రార్థిస్తూ కుంకుమార్చన చేశారు.మహిళల సామూహిక పూజలతో మండపం వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.వినాయక నవరాత్రుల సందర్భంగా కాలనీలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.



# సుప్రీంకోర్టుకు వెళ్లను

## : దానం నాగేందర్ కీలక ప్రకటన



తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పుపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించే ఉద్దేశం తనకు లేదని ఆయన స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పును తాను గౌరవిస్తున్నట్టు పేర్కొన్న ఆయన, మీడియా సమావేశంలో తన తదుపరి నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ, "ప్రజాక్షేత్రంలోనే, ఎన్నికల్లోనే అన్ని విషయాలు తేల్చుకుంటాం. నాకు ఎన్నికల్లో పోటీ చేయడం కొత్తేమీ కాదు. అనేక పోరాటాల ద్వారానే నేను ఈ స్థాయికి చేరుకున్నాను. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజల మద్దతుతో పోరాడి విజయం సాధిస్తాను" అని ధీమా వ్యక్తం చేశారు. న్యాయపోరాటం కంటే రాజకీయంగానే దీనిని ఎదుర్కోవాలని నిర్ణయించుకున్నట్లు ఆయన పరోక్షంగా సంకేతాలిచ్చారు.గతంలో స్పీకర్ ఇచ్చిన నిర్ణయాన్ని పక్కనపెట్టిన హైకోర్టు, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై ఉన్నత న్యాయస్థానానికి వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, నాగేందర్ మాత్రం తన పోరాటాన్ని ప్రజాక్షేత్రానికే పరిమితం చేయాలని నిర్ణయించుకున్నారు.



# బీఎస్పీ నుంచి 60 మంది కాంగ్రెస్‌లో చేరిక

**ప్రజా వాయిస్ కగజ్ నగర్**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి దుర్గం ప్రవీణ్, దక్కలి సంఘం జిల్లా అధ్యక్షుడు జడల శంకర్ నేతృత్వంలో సుమారు 60 మంది యువకులు, మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దండే విఠల్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.సిర్పూర్ నియోజకవర్గంలో దశాబ్దాలుగా అగ్రవర్ణ ఆధిపత్యం కొనసాగుతున్నా పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదని చేరిన వారు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చే కాంగ్రెస్ విధానాల పట్ల ఆకర్షితులై చేరినట్లు పేర్కొన్నారు.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, వివేక్ వెంకటస్వామి, సీతక్కలకు కీలక బాధ్యతలు కల్పించడం ద్వారా కాంగ్రెస్ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తోందని, బడుగు బలహీన వర్గాలకు పార్టీ పెద్దపీట వేస్తుందనే నమ్మకంతోనే చేరినట్లు వారు వివరించారు.ఈ కార్యక్రమంలో మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురే శ్యామ్‌రావు, వార్డు సభ్యుడు ముక్రం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



# లోనవెల్లిలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన

**ప్రజా వాయిస్ సిర్పూర్ టి**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సీర్‌పూర్ (టి) మండలం లోనవెల్లి గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటి, మండల వ్యవసాయ అధికారి భూక్య గిరీషన్ పాల్గొని రైతులకు సాగు వివరాలు వివరించారు. బోరు లేదా నీటి సౌకర్యం ఉన్న రైతులకు ఆయిల్ పామ్ సాగు మంచి అవకాశమని అధికారులు తెలిపారు.ఆయిల్ పామ్ నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమై 25--35 సంవత్సరాల వరకు స్థిరమైన ఆదాయం అందిస్తుంది. మొదటి నాలుగు సంవత్సరాల గర్భకాలంలో ఇంటర్ క్రాప్ సాగు చేసుకోవచ్చు. ఈ కాలంలో ఎకరాకు ఏటా ?4,200 నిర్వహణ, ఇంటర్ క్రాప్ ఖర్చుల కోసం ప్రభుత్వం సహాయం అందిస్తుంది. రైతులకు డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలు కూడా సమకూరుస్తారు. ఎకరాకు 57 మొక్కలు నాటే ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు 100% సబ్సిడీ లభిస్తుంది.తెలంగాణ ఆయిల్ పామ్ మిషన్ కింద అర్హులైన రైతులు ఈ దీర్ఘకాలిక పంట సాగుకు ముందుకు రావాలని, పూర్తి సాంకేతిక సహాయం అందిస్తామని అధికారులు కోరారు. మరిన్ని వివరాలకు వ్యవసాయ విస్తరణ అధికారిని లేదా మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.ఈ కార్యక్రమంలో లోనవెల్లి గ్రామ సర్పంచ్ సంతోష్, ఉప సర్పంచ్ సతీష్, వ్యవసాయ విస్తరణ అధికారులు రవికుమార్, విశాల్, శంకర్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వెంపల్లి, అచెల్లి, రుద్రారంలో చేయూత పెన్షన్ లబ్ధిదారుల నమోదు

**ప్రజా వాయిస్ సిర్పూర్ టి**

సిర్పూర్ టి మండలంలోని వెంపల్లి, అచెల్లి, రుద్రారం గ్రామాల్లో చేయూత పెన్షన్ లబ్ధిదారుల డాక్యుమెంట్లు పరిశీలించి మొబైల్ యాప్‌లో నమోదు చేశారు. అనంతరం అచెల్లి గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని గుత్తేదారును ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏపీఓ చంద్రయ్య, కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.






# పేదలకు సీఎం సహాయనిధి అండ

**ఆపదలో ఉన్న పేదలకు ఆర్థిక భరోసా**

**రూ.60 వేల సీఎం సహాయనిధి చెక్కు అందజేత**

**మూడు చింతలపల్లి / ప్రజా వాయిస్ :**
పేద, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మూడు చింతలపల్లి ప్రాంతానికి చెందిన నరసింహారెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును శుక్రవారం ఆయన నివాసంలో వజ్రేష్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలోని పేద ప్రజలకు ప్రభుత్వం అనేక విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, వేణుగోపాల్ రావు, రాజేంద్రప్రసాద్, జెర్రిపోతుల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.




# కలెక్టరేట్ లో ప్రపంచ వెదురు దినోత్సవం

**మహబూబాబాద్ ప్రజా వాయిస్**
శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో గౌరవజిల్లాకలెక్టర్,మహబూబాబాద్ అనుమతితో లిప్రపంచ వెదురు దినోత్సవాన్నిలి నిర్వహించారు.ఈ సందర్భంగా లిజిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాయిశ్రీజలి మాట్లాడుతూ భూమి కోతను నివారించడంలో, నేలను గట్టిగా పట్టుకోవడంలో వెదురు ముఖ్య పాత్ర పోషిస్తుందని ఇది కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకుని, పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందని గ్రామీణ ప్రాంతాల్లోని చేతివృత్తిదారులకు, మేదరి కుటుంబాలకు వెదురు కళారూపాలు, బుట్టలు, గృహోపకరణాలు మంచి ఉపాధిని అందిస్తున్నాయని అన్నారు. ప్లాస్టిక్‌కు ఇది చక్కటి పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయం వెదురును మరింతగా పెంచుదాం, ప్రకృతిని కాపాడుకుందాం అని ఈ సందర్భంగా అధికారి అన్నారు.ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారులు,జిల్లా అధికారులు,ఐ డి ఓ సి కార్యాలయ సిబ్బంది,మరియు జిల్లాలోని మేదర సంఘాల నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.



# పోచంలోద్ది ఆశ్రమ పాఠశాలలో గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ తనిఖీ

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం పోచంలోద్ది ఆశ్రమ ఉన్నత పాఠశాలను జిల్లా గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, తరగతి గదుల బోధన, వసతి గృహ నిర్వహణ, భోజనశాల, వంటశాల, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, వైద్య సదుపాయాలు, భద్రతా చర్యలను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, ఆహారం నాణ్యత, వసతి సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకున్నారు.

ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పోషకాహారం అందేలా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అధికారులు, ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రత, విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు విద్యార్థినులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీతో పాఠశాల నిర్వహణపై మరింత బాధ్యతతో పనిచేయాలని సిబ్బందికి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**భద్రత, బారికేడ్లు, లైటింగ్, తాగునీటి వసతులపై ప్రత్యేక దృష్టి**

**శాఖల మధ్య సమన్వయంతో నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలి**

**ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలి**

**అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచాలి**

**నిమజ్జన ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచన**

**నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన ఆర్డీఓ రమణారెడ్డి**

ప్రజా వాయిస్ వేములపల్లి
గణేష్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా వేములపల్లి మండల పరిధిలోని నిమజ్జన ప్రాంతాల్లో అధికారులు చేపట్టిన ఏర్పాట్లను ఆర్డీఓ రమణారెడ్డి పరిశీలించారు. నిమజ్జనానికి భారీ సంఖ్యలో భక్తులు, గణేష్ విగ్రహాలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.నిమజ్జన ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు, బారికేడ్లు, విద్యుత్ సౌకర్యం, లైటింగ్, తాగునీటి వసతి, పారిశుద్ధ్య నిర్వహణ తదితర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. భక్తులు, యువత నిమజ్జన సమయంలో అప్రమత్తంగా ఉండేలా అవసరమైన సూచనలు చేయాలని అధికారులకు తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని సూచించారు.అలాగే నిమజ్జనానికి వచ్చే ప్రజలకు తాగునీరు, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రాత్రి వేళల్లో కూడా తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు అధికారులు అందుబాటులో ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ రమణారెడ్డి సూచించారు.ఆయన వెంట మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ శ్రీజారెడ్డి, వేములపల్లి ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్ కోటేశ్వరి, ఎస్సై డి. వెంకటేశ్వర్లు, రెవెన్యూ, పోలీసు, పంచాయతీ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పద్య పఠనంతో తెలుగు భాషకు పట్టం.!

**తాళ్లపల్లి జడ్పీహెచ్ఎస్‌లో మండలస్థాయి పోటీలు**

**జ్ఞాన సరస్వతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రతిభకు వేదిక**

**ముఖ్య అతిథిగా ఎంఈఓ డి. లక్ష్మణ్ నాయక్.. విజేతలకు బహుమతులు**

**మాతృభాషపై మమకారం పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరం**

ప్రజా వాయిస్,షాబాద్:
రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం తాళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞాన సరస్వతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి పద్య పఠన పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. మండలంలోని వివిధ జడ్పీహెచ్ఎస్‌లు, ప్రాథమికోన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొని పద్యాలను చక్కగా ఆలపించారు.కార్యక్రమానికి మండల విద్యాధికారి డి. లక్ష్మణ్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో మాతృభాషపై అభిరుచి, మమకారం పెంపొందించేందుకు పాఠశాల స్థాయి నుంచే తెలుగు



పద్యాల ప్రాశస్త్యాన్ని, కవుల గొప్పతనాన్ని పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంచి ఆశయంతో పోటీలు నిర్వహించిన జ్ఞాన సరస్వతి ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. కిరణ్మయి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి పద్యాన్ని చదవడంతోపాటు దాని భావాన్ని గ్రహించేలా ప్రోత్సహించాలన్నారు. పద్యం రసనైవేద్యం లాంటిదని, పద్యాన్ని సులభంగా నేర్చుకున్న విద్యార్థులు గద్యంతోపాటు ఇతర అంశాలను కూడా వేగంగా అవగాహన చేసుకోగలరని పేర్కొన్నారు.విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంగమేశ్వర్‌రెడ్డి, నాగిరెడ్డి, కృష్ణారెడ్డి, భాస్కర్, బాలకృష్ణ, సుశీల, విమల, లీల, అనురాధ, రాజ్యలక్ష్మి, కవిత, నాగరాణి, గ్లోరీ, అశోక్‌గౌడ్, మహేందర్, నర్సింలు, కృష్ణ, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

**విజేతలు వీరే..**

- 6వ తరగతి: ప్రథమ – ఎం. గీతాంజలి (యూపీఎస్ చందనవెల్లి); ద్వితీయ – కే. నిహారిక (జడ్పీహెచ్ఎస్ హైతాబాద్)
- 7వ తరగతి: ప్రథమ – జి. మధుప్రియ (జడ్పీహెచ్ఎస్ హైతాబాద్); ద్వితీయ – డి. ఆద్యశ్రీ (మోడల్ స్కూల్)
- 8వ తరగతి: ప్రథమ – ఎం. భవేష్ (జడ్పీహెచ్ఎస్ తాళ్లపల్లి); ద్వితీయ – మాయశ్రీ (జడ్పీహెచ్ఎస్ హైతాబాద్)
- 9వ తరగతి: ప్రథమ – ప్రవస్థి (జడ్పీహెచ్ఎస్ హైతాబాద్); ద్వితీయ – మౌనిక (జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ షాబాద్)
- 10వ తరగతి: ప్రథమ – ఎస్. ప్రణవి (జడ్పీహెచ్ఎస్ తాళ్లపల్లి); ద్వితీయ – మీనాక్షి (మోడల్ స్కూల్)

# కుసుమ సాగుతో అదనపు ఆదాయం

**షాబాద్‌లో 200 హెక్టార్లకు 20 క్వింటాళ్ల ధ్రువీకరించిన విత్తనాల పంపిణీ**

**లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ**

**పాల్గొన్న చేవెళ్ల ఎమ్మెల్యే పాలే యాదయ్య, గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి**

ప్రజా వాయిస్,షాబాద్,:
నూనెగింజల ఉత్పత్తిని పెంచేందుకు రైతులు కుసుమ సాగును ప్రత్యామ్నాయ పంటగా చేపట్టాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి సూచించారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్,ఆయిల్ సీడ్స్ 2026,27లో భాగంగా షాబాద్ రైతువేదికలో శుక్రవారం కుసుమ విత్తనాల పంపిణీ, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపిక చేసిన రైతులకు కుసుమ,లక్ష్మీప్రియ (ISF-764) రకం ధ్రువీకరించిన విత్తనాలను అందజేశారు. మొత్తం 20 క్వింటాళ్ల విత్తనాలను 200 హెక్టార్లకు సరిపడా.. హెక్టారుకు 10 కిలోల చొప్పున పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు కుసుమ సాగు విధానం, కలుపు నివారణ, ఎరువుల వినియోగం, తెగుళ్ల నియంత్రణ, దిగుబడి పెంపు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. నాణ్యమైన విత్తనాలను వినియోగించి శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చని తెలిపారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, శాఖాపరమైన సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

**సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ**

షాబాద్ మండలానికి సంబంధించిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.కార్యక్రమంలో సర్దార్‌నగర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పిసరి సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెంటారెడ్డి, సర్పంచులు, ఎఫ్‌పీవో ప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.





# కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ రెండోరోజూ సర్వే.. 388 ఎకరాలపై అధికారుల దృష్టి

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారుల భూ సర్వే రెండో రోజూ కొనసాగింది. సిద్దిపేట జిల్లా మార్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలోని ఫామ్‌హౌస్‌ను ఆనుకొని ఉన్న భూములను అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఎర్రవల్లి, వెంకటాపూర్, వరదరాజపూర్ గ్రామాల సరిహద్దుల్లో విస్తరించి ఉన్న సర్వే నంబర్ 325లోని 388 ఎకరాల భూములపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. గురువారం ఈ మూడు గ్రామాల సరిహద్దులను గుర్తించిన బృందాలు, రెండో రోజైన శుక్రవారం ఆ భూములకు సంబంధించిన పాత రైతుల వివరాలను, ప్రస్తుత రెవెన్యూ రికార్డులను సేకరించాయి.ఏడీ సుదర్శన్ రాథోడ్, డీఐ సేవియా నాయక్ పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక బృందాలు ఈ సర్వే ప్రక్రియను నిర్వహించాయి. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారం, రెవెన్యూ రికార్డుల ఆధారంగా అధికారులు సమగ్ర నివేదికను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే, ఈ సర్వే చేపట్టడానికి గల కచ్చితమైన కారణాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.



# కోరుట్ల పట్టణంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**స్థానిక కౌన్సిలర్ మేడిపల్లి శిరీష శేఖర్ రెడ్డి**

**ప్రజా వాయిస్ కోరుట్ల:**
కోరుట్ల పట్టణంలోని 6వ వార్డు యకిన్‌పూర్‌లో ప్రభుత్వం అందించే స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులైన లబ్ధిదారులకు ఘనంగా పంపిణీ చేశారు. స్థానిక కౌన్సిలర్ మేడిపల్లి శిరీష శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మేడిపల్లి శిరీష శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ వెలుమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కోరుట్ల పట్టణ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ ఆదేశాల మేరకు వార్డు ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను చేరువ చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే వార్డు ప్రజలందరికీ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అర్హులైన పేద ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జీపీఓ పబ్బ సాగర్, రేషన్ డీలర్ ఎన్నమనేని మదన్ రావు, వార్డు ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# టీబీని దాచకండి పరీక్ష చేయించుకోండి

**షాద్ నగర్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి**

**ఫరూక్‌నగర్ హైస్కూల్లో ఎన్‌సీసీ విద్యార్థులకు టీబీ ముక్త భారత్‌పై అవగాహన**





**ప్రజా వాయిస్ షాద్ నగర్:**
ఫరూక్‌నగర్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు నిక్షయ్ మిత్ర కార్యక్రమం ద్వారా టీబీ ముక్త భారత్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజంలోని వ్యక్తులు, సంస్థలు, యువత, విద్యాసంస్థలు టీబీ నిర్మూలన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు.క్షయవ్యాధి మైకోబ్యాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందని, ముఖ్యంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుందని తెలిపారు. దీర్ఘకాలంగా దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు కనిపించవచ్చని చెప్పారు. రెండు వారాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం దగ్గు ఉన్నవారు తప్పనిసరిగా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని విద్యార్థులకు సూచించారు ఎన్‌సీసీ విద్యార్థులు టీబీపై అవగాహన ర్యాలీలు నిర్వహించడం పోస్టర్లు కరపత్రాల ద్వారా ప్రచారం చేయడం కుటుంబాలు మరియు పరిసర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించడం అనుమానితులను ఆరోగ్య కేంద్రాలకు వెళ్లేలా ప్రోత్సహించడం వంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని శ్రీనివాసులు తెలిపారు. టీబీ రోగుల పట్ల వివక్ష చూపకుండా వారికి సహకరించాలని చికిత్సను మధ్యలో నిలిపివేయకుండా పూర్తిగా కొనసాగించేలా ప్రోత్సహించాలని సూచించారు
టీబీని దాచకండి పరీక్ష చేయించుకోండి చికిత్సను మధ్యలో ఆపకండి పూర్తిగా తీసుకోండి టీబీ రోగిని దూరం చేయకండి చేయూతనివ్వండి మనమంతా కలిసి నిర్మిద్దాం టీబీ ముక్త భారత్ అని ఆయన పిలుపునిచ్చారు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వి. విజయలక్ష్మి మాట్లాడుతూ టీబీకి ప్రస్తుతం సమర్థవంతమైన చికిత్స అందుబాటులో ఉందని తెలిపారు. వైద్యుల సూచనల మేరకు మందులను సరైన మోతాదులో, నిర్ణీత కాలం పాటు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. వ్యాధి తీవ్రతను బట్టి సాధారణంగా ఆరు నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలం చికిత్స కొనసాగవచ్చని తెలిపారు.
కొన్ని రకాల టీబీ బ్యాక్టీరియాలు సాధారణ మందులకు స్పందించకపోవచ్చని, దీనిని ఔషధ నిరోధక టీబీగా పరిగణిస్తారని చెప్పారు. ఇలాంటి సందర్భాల్లో ప్రత్యేక పరీక్షలు నిర్వహించి, నిపుణుల పర్యవేక్షణలో తగిన చికిత్స అందిస్తారని వివరించారు. చికిత్సతో పాటు పోషకాహారం తీసుకోవాలని, మందులను సమయానికి వేసుకోవాలని, పొగతాగడం, మద్యం సేవించడం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. దగ్గు, తుమ్ములు వచ్చినప్పుడు నోరు, ముక్కును కప్పుకోవాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, టీబీ సూపర్‌వైజర్ రవికుమార్, పాఠశాల ఎన్‌సీసీ మాస్టర్ విష్ణువర్ధన్, పీపీ యూనిట్ ఆశా కార్యకర్తలు, ఫరూక్‌నగర్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు..

# రెండు రోజుల్లోనే సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ

**ప్రత్యేక చొరవ తీసుకున్న స్పీకర్ ప్రసాద్ కుమార్**



**ప్రజావాయిస్ /మోమిన్‌పేట్**
వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామానికి సంబంధించిన మంగలి పవన్ తండ్రి రాములు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల ఓ ఆసుపత్రిలో చికిత్సకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చొరవతో సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద రూ.2.25 లక్షల విలువైన ఎల్‌ఓసీ మంజూరైంది. ప్రజాపాలనలో ఎల్‌ఓసీ కోసం దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లోనే మంజూరు చేయడంపై పవన్ తల్లిదండ్రులు ప్రభావతి, రాములు, ఎన్కేపల్లి సర్పంచ్ కోస్గి సురేందర్, కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు స్పీకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు హర్షం వ్యక్తం చేశారు.

# 13వ వార్డులో కౌన్సిలర్ దండు సారయ్య ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం

**అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న**

**13వ వార్డు కౌన్సిలర్, జననేత దండు సారయ్య**





**ప్రజావాయిస్, ఇల్లందు(సెప్టెంబర్18)**
:గణేష్ నవరాత్రుల్లో భాగంగా ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో కౌన్సిలర్ దండు సారయ్య స్వతహాగా తన ఇంటివద్ద ఏర్పాటు చేసుకున్న గణేషుడి మండపం వద్ద శుక్రవారం మధ్యాహ్నం మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ మేరకు తొలుతగా వినాయకుడికి జననేత, కౌన్సిలర్ దండు సారయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ఉద్యమనేత దిండిగల రాజేందర్, 18వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ పాబోలు స్వాతికిరణ్ దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరవగా దండు సారయ్య శాలువాలతో సత్కరించారు. అనంతరం దండు సారయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నప్రసాద కార్యక్రమానికి భక్తులు, ప్రజలు అధికసంఖ్యలో హాజరవగా దండు సారయ్య భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా జననేత దండు సారయ్య మాట్లాడుతూ..వినాయక ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజలందరినీ ఒకేవేదికపైకి తీసుకొచ్చే సామాజిక వేడుకలుగా ఉండాలని హితవు పలికారు. అన్నిదానాల కన్నా అన్నదానమే మిన్న అని నేడు నా చేతులమీదుగా చేసిన అన్నదానానికి ప్రతిఏడులానే ఈ ఏడాది కూడా భారీసంఖ్యలో హాజరైన నావార్డు ప్రజలు, భక్తులు, ఇల్లందు పట్టణ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, 18వ వార్డు కౌన్సిలర్ పాబోలు స్వాతికిరణ్, నాయకులు అబ్దుల్ నబీ, యువకులు రాజు, దండు సారయ్య అనుచరులు, వార్డుప్రజలు, ఉత్సవ కమిటీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఓటు హక్కు పరిరక్షణకు సహకరించాలి

**- మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి**

**- అనంతగిరిపల్లిలో ఎస్ఐఆర్ ప్రత్యేక కార్యక్రమం**

**ప్రజావాయిస్/వికారాబాద్:**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు అనంతగిరిపల్లిలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఎస్ ఐ ఆర్ లో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు తప్పనిసరిగా 13 రకాల ధృవపత్రాల్లో ఏదో ఒక ధృవపత్రాన్ని బూత్ లెవల్ అధికారులకు అందజేయాలని సుధాకర్ రెడ్డి సూచించారు. ప్రతి ఓటరు ఈ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని, తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు అవసరమైన పత్రాలను సమర్పించాలని కోరారు.అనంతగిరిపల్లి వార్డు ప్రజలు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎమ్మార్వో, బిఎల్ ఓలు, వార్డు అధికారులు, స్థానిక నాయకులు రెడ్యా నాయక్, మాజీ కౌన్సిలర్ మురళి, డైరెక్టర్ రాజు నాయక్, సోషల్ మీడియా ప్రతినిధులు నరసింహులు, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

# దానం నాగేందర్ రాజీనామా చేయాలి: ఏలేటి



పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన సంచలన తీర్పును బీజేపీ తీవ్రంగా స్వాగతించింది. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ సుప్రీంకోర్టుకు వెళ్లే ప్రయత్నం చేయకుండా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దానం నాగేందర్ ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉన్నందున, రేపే బీజేపీ తరపున కేవియట్ పిటిషన్ దాఖలు చేస్తామని స్పష్టం చేశారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను విలీనం చేసుకోవాలనే కాంగ్రెస్ కుట్రలకు ఈ తీర్పు చెంపపెట్టు అని, ఇప్పటికైనా అధికార కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని పార్టీ మారిన మిగిలిన ఎమ్మెల్యేలతో కూడా రాజీనామాలు చేయించి ఉపఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు.మరోవైపు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కూడా హైకోర్టు నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఇది ప్రజాస్వామ్య విజయమని అభివర్ణించారు. ఆరు నెలల వ్యవధిలోనే రాజ్యాంగబద్ధమైన తీర్పు రావడం చారిత్రాత్మకమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ తీరుకు ఈ తీర్పు సరైన సమాధానమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం, విలువలతో కూడిన రాజకీయం కోసం హైకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని మరింత పెంచాయని అభిప్రాయపడ్డారు.

# రైతులు ప్రకృతి సేద్యంపై దృష్టి సారించాలి



**ప్రజా వాయిస్ దౌల్తాబాద్, సెప్టెంబర్ 18:**
రైతులు రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి సేద్యంపై దృష్టి సారించాలని దుబ్బాక ఏడీఏ మల్లయ్య అన్నారు. శుక్రవారం తిరుమలాపూర్ రైతు వేదికలో ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి సేద్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రకృతి సేద్యంతో ఆరోగ్యకరమైన పంటలను పండించడంతో పాటు రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. ప్రతి రైతు తనకున్న భూమిలో కనీసం ఒక ఎకరం మేర ప్రకృతి సేద్యం చేపట్టాలని కోరారు.తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ బీజామృతం, దశపర్ణి, పంచగవ్య, ఘనజీవామృతం వంటి ప్రకృతి సేద్య పద్ధతులను రైతులు అవలంబించాలని సూచించారు. ఆవుపేడ, ఆవు మూత్రంతో సహజ ఎరువులు, కీటక నివారణ ద్రావణాలను తయారు చేసుకుని చీడపీడలను నియంత్రించవచ్చని తెలిపారు. తద్వారా సాగు ఖర్చులను తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు.అగ్రానమీ శాస్త్రవేత్త శ్వేత మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండారు లాలు, ఏఓ సాయికిరణ్, శాస్త్రవేత్త సరిత, ఉపసర్పంచ్ నాగరాజు, ఏఈఓలు గౌతమి, అభిలాష్, నరేష్‌రెడ్డితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# నందిగ్రామ్‌లో అనూహ్య మలుపు..

# కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన మమత!



పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. నందిగ్రామ్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు తెలుపుతున్నట్లు మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. తమ పార్టీ అభ్యర్థి నామినేషన్‌ను ఉపసంహరించుకున్న నేపథ్యంలో, బీజేపీకి వ్యతిరేకంగా 'ఇండియా' కూటమి ఐక్యతను చాటేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు.ఉప ఎన్నికకు ఇంకా నెల రోజుల సమయం ఉండగానే, మమత నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అభ్యర్థి సంచితా ప్రధాన్ అనూహ్యంగా తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఈ పరిణామంతో తాము మరో అభ్యర్థిని బరిలోకి దించబోమని, కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు పూర్తిస్థాయిలో మద్దతిస్తామని మమతా బెనర్జీ వెల్లడించారు.ఈ సందర్భంగా మమత బెనర్జీ మాట్లాడుతూ, "మేము పోరాటానికి సిద్ధంగా ఉన్నాము. దేశం నుంచి బీజేపీని తరిమికొట్టడమే మా లక్ష్యం. ఇండియా కూటమికి మా పూర్తి సంఘీభావం ఉంటుంది" అని పేర్కొన్నారు. అంతకుముందు రోజు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తనకు ఫోన్ చేశారని, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సైతం మద్దతు తెలుపుతూ సందేశం పంపారని ఆమె వివరించారు. ఇదే క్రమంలో బీజేపీని ఒక 'జుమ్లా పార్టీ'గా ఆమె అభివర్ణించారు.రాష్ట్ర సచివాలయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి సువేందు అధికారిని కలిసిన తర్వాత సంచితా ప్రధాన్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడం గమనార్హం. కాగా టీఎంసీలోని రెండు వర్గాలకు ఎన్నికల సంఘం కొత్త గుర్తులను కేటాయించింది. మమత వర్గానికి 'ఫుట్‌బాల్ ప్లేయర్', ప్రత్యర్థి వర్గానికి 'ఎన్వలప్' గుర్తులను కేటాయించిన సంగతి తెలిసిందే




# పాఠశాలలు, కళాశాలలకు రగ్బీ బాల్స్ పంపిణీ

## విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం పుస్కూరి శ్రీనివాస్ రావు

**ప్రజా వాయిస్ ప్రతినిధి/పాలకుర్తి /సెప్టెంబర్ 18**

జనగాం జిల్లా, సెప్టెంబర్ 18:

జనగాం జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిధిలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు రగ్బీ బాల్స్‌ను పంపిణీ చేశారు. జిల్లా రగ్బీ అసోసియేషన్ చైర్మన్, మాజీ జనగాం జిల్లా జెడ్పీ ఫ్లోర్ లీడర్ పుస్కూరి శ్రీనివాస్ రావు ఆయా విద్యాసంస్థలకు రగ్బీ బాల్స్ అందజేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడంతో పాటు జిల్లాలో రగ్బీ క్రీడ అభివృద్ధికి అసోసియేషన్ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు దొంతమల్ల గణేష్, ఉపాధ్యక్షుడు మామిండ్ల సోమల్లు, ప్రధాన కార్యదర్శి బాలబోయిన సందీప్, ఆర్గనైజింగ్ కార్యదర్శి రావుల కుమారస్వామి, సంయుక్త కార్యదర్శి జోడు సంతోష్, కోశాధికారి బాలబోయిన నరేష్, కమిటీ సభ్యులు బెల్లంకొండ సాయి కుమార్, మొగులగాని నరేష్, నోముల శ్రీకాంత్, అరకల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# వెదురు వస్తువుల వినియోగంతో పర్యావరణ పరిరక్షణ

## కలెక్టర్ కె.హరిత

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వెదురుతో తయారుచేసిన వస్తువుల వినియోగం ద్వారా కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని జిల్లా కలెక్టర్ కె.హరిత తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ వెదురు దినోత్సవ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్‌తో కలిసి కలెక్టర్ హాజరయ్యారు.వెదురు పెంచడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చని, మేదరులు తయారుచేసే వెదురు వస్తువులను కొనుగోలు చేసి వారి కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు అందించాలని కలెక్టర్ కోరారు. మేదర కులస్తులు నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకోవాలని, అటవీ శాఖ అధికారులతో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరిస్తామని, అర్హులైన మేదర కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ వెదురు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా మేదరులు తయారుచేసిన వస్తువులను కలెక్టర్ పరిశీలించగా, వెదురుతో చేసిన శ్రీ వెంకటేశ్వర స్వామి జ్ఞాపికను ఆమెకు అందజేశారు.



# మున్నూరుకాపు సంఘం పటేల్స్ వెబ్‌సైట్ ఆవిష్కరణ

**ప్రజా వాయిస్ కగజ్ నగర్**

కాగజ్‌నగర్ మండలం తెలంగాణలోని మున్నూరుకాపులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఐక్యతను పెంపొందించేందుకు కుటుంబ సభ్యత్వం నమోదు కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేసినట్లు తెలంగాణ మున్నూరుకాపు సంఘం పటేల్స్ రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్ తెలిపారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లోని పటేల్ గార్డెన్‌తో పాటు ఆసిఫాబాద్‌లోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్‌తో కలిసి ఆయన వెబ్‌సైట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఆసిఫాబాద్ జిల్లా యూత్ అధ్యక్షుడు గాజుల ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పూదారి సాయి (గోలేటి), కాగజ్‌నగర్ మండల అధ్యక్షుడు మేడిపల్లి రవి, వైస్ ప్రెసిడెంట్ పేరుక మహేష్, మండల యూత్ అధ్యక్షుడు పార్వతి సురేష్, ఉపాధ్యక్షుడు డెక్కపురి గోపాల్, పట్టణ అధ్యక్షుడు చిట్టంపల్లి అనిల్, ప్రధాన కార్యదర్శి పూదారి సాయి, కోశాధికారి పుల్లిశెట్టి వెంకటేష్‌లకు పదవులు అందజేశారు.

# 100 అడుగుల రహదారి కావాలి/నిర్వాసితులూ బతకాలి

**74 కుటుంబాలకు న్యాయం చేసిన తర్వాతే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి**

**అధికారంలో ఉన్నప్పుడు రోడ్డు గుర్తుకురాలేదా.?**

**ఇప్పుడు ధర్నాల పేరుతో డ్రామాలా.?**

**బిఆర్ఎస్ నేతలపై ధ్వజమెత్తిన బీజేపీ నేత నీరుడు పవన్ సాయి**


**ప్రజా వాయిస్// రాజేంద్రనగర్:**

రాజేంద్రనగర్:బండ్లగూడ చౌరస్తా నుంచి కిస్మత్‌పూర్ దర్గా మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు వరకు ప్రతిపాదించిన 100 అడుగుల రహదారి ప్రాంత అభివృద్ధికి, పెరుగుతున్న ప్రజా రవాణా సౌకర్యానికి అవసరమేనని బీజేపీ నాయకుడు నీరుడు పవన్ సాయి అన్నారు. అయితే రహదారి నిర్మాణం వల్ల ఇళ్లు కోల్పోయే 74 కుటుంబాలకు ముందుగా న్యాయం చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు.రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు తొలగించాల్సి వస్తే, బాధిత కుటుంబాలకు న్యాయమైన పరిహారం, పునరావాసం, ప్రత్యామ్నాయ వసతి వంటి అంశాలపై ప్రభుత్వం ముందుగా స్పష్టత ఇవ్వాలని పవన్ సాయి సూచించారు.తమ ఇళ్లు, జీవనాధారాన్ని కోల్పోయే కుటుంబాల సమస్యను పరిష్కరించకుండా నిర్మాణ పనులు చేపట్టడం సరికాదన్నారు.అభివృద్ధి పనులు ప్రజలకు మేలు చేసేలా ఉండాలి తప్ప, అదే ప్రజలను నష్టపరిచేలా ఉండకూడదని ఆయన పేర్కొన్నారు.100 అడుగుల రహదారి అవసరాన్ని తాము వ్యతిరేకించడం లేదని,అయితే రహదారి కోసం ప్రభావితమయ్యే 74 కుటుంబాల హక్కులను కూడా ప్రభుత్వం పరిరక్షించాలన్నారు.పదేళ్లు అధికారంలో ఉండి 100 అడుగుల రహదారి సమస్యను పరిష్కరించని బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు ప్రభుత్వం మారగానే ధర్నాలకు దిగడం విడ్డూరంగా ఉందని బీజేపీ నాయకుడు నీరుడు పవన్ సాయి విమర్శించారు.అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు గుర్తుకురాలేదా.? ఇప్పుడు ధర్నాలతో ప్రజలపై ప్రేమ ఒలకబోస్తున్నారా.? అని ప్రశ్నించారు.రోడ్డు నిర్మాణం అవసరమేనని,అయితే దాని కోసం ఇళ్లు కోల్పోయే 74 కుటుంబాలకు ముందుగా న్యాయం చేయాలన్నారు.పదేళ్లు చేయలేనిది,ఇప్పుడు ధర్నాలతో సాధిస్తామంటే ప్రజలు నమ్మరని పవన్ సాయి పేర్కొన్నారు.



# ముందు తాగునీరు..ఆ తర్వాతే సాగునీరు

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించాల్సిన అవసరం ఉందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం శాసనసభలో ఎల్‌నినో ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ప్రజల తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇచ్చిన తర్వాతే సాగునీటికి నీటిని కేటాయిస్తామని స్పష్టం చేశారు.కృష్ణా, గోదావరి బేసిన్లలోని జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని మంత్రి తెలిపారు. సెప్టెంబర్ 17 నాటికి రెండు బేసిన్లలో కలిపి 585 టీఎంసీల ప్రత్యక్ష నిల్వ సామర్థ్యానికి గాను 241 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని, గత ఏడాది ఇదే సమయానికి 497 టీఎంసీలు ఉన్నాయని వివరించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రధాన జలాశయాల్లోనూ గత ఏడాదితో పోలిస్తే నిల్వలు గణనీయంగా తగ్గినట్లు తెలిపారు.వచ్చే వేసవిలో తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. మిషన్ భగీరథ అవసరాలను తీర్చిన తర్వాతే నీటి లభ్యతను బట్టి పంటలకు సాగునీటిని విడుదల చేస్తామని తెలిపారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో పంటలకు అవసరమైన నీటిని అందుబాటును బట్టి వంతుల వారీగా కేటాయించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. యాసంగి సాగుకు కూడా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.నీటి లభ్యత తక్కువగా ఉన్న పరిస్థితుల్లో రైతులు తక్కువ నీటితో సాగు చేసే పంటలను పరిశీలించాలని ప్రభుత్వం సూచిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జలాశయాల నీటి నిల్వలు, ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యతల ప్రకారం వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తాగునీటి భద్రతను కాపాడుతూ రైతుల సాగునీటి అవసరాలను కూడా అందుబాటులో ఉన్న మేరకు పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.కాళేశ్వరం ప్రాజెక్టుపైనా మంత్రి సభలో వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టుల విషయంలో తీసుకున్న నిర్ణయాలు, భారీగా చేసిన వ్యయం, ప్రస్తుత పరిస్థితిపై ఆయన విమర్శలు చేశారు. కాళేశ్వరం బ్యారేజీలను నీటి నిల్వకు ఉపయోగించే విషయంలో భద్రతా అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందని ప్రభుత్వం పేర్కొంది. ఈ అంశంపై సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య చర్చ జరిగింది.ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో తాగునీటి భద్రత, సాగునీటి అవసరాలు, భవిష్యత్ నీటి లభ్యతను సమన్వయం చేస్తూ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. రిజర్వాయర్లు, చెరువుల్లోని నీటిని పొదుపుగా వినియోగిస్తూ వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.



# సీఎం విజయ్ కీలక నిర్ణయం.. పుట్టిన బిడ్డకు బంగారు ఉంగరం!


తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టింది. ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించే ప్రతి నవజాత శిశువుకు ఒక గ్రాము బంగారు ఉంగరాన్ని బహుమతిగా అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అక్టోబర్ 6న జరగనున్న అసెంబ్లీ ఉపఎన్నికల నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.'తైమామన్ తంగ మోతిరం' (మేనమామ బంగారు ఉంగరం)' పేరిట రూపొందించిన ఈ పథకాన్ని సెప్టెంబర్ 28న అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ ఏడాది జూన్ 22వ తేదీ నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన శిశువులందరికీ ఈ పథకం వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. అర్హులైన లబ్ధిదారులకు సెప్టెంబర్ 22 నుంచి ఉంగరాల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం రూ. 755 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది.తమిళనాడు శాశ్వత నివాసితులై ఉండి, PICME పోర్టల్‌లో RCH ఐడీతో నమోదైన తల్లులకు జన్మించిన శిశువులు ఈ పథకానికి అర్హులు. తొలి దశ అమలు కోసం ఇప్పటికే 1.28 లక్షల బంగారు ఉంగరాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. ప్రతి ఉంగరానికి ఒక ప్రత్యేక సీరియల్ నంబర్‌ను కేటాయించారు. ప్రాథమికంగా 107 పంపిణీ కేంద్రాల ద్వారా ఈ ఉంగరాలను అందజేస్తారు. భవిష్యత్తులో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే సమయంలోనే శిశువులకు వీటిని అందించేలా పటిష్ఠమైన ఏర్పాట్లు చేస్తున్నారు.మధురాంతకం, ధరాపురం నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ పథకం ప్రకటన వెలువడింది. అయితే, ఎన్నికల ప్రవర్తనా నియమావళి



అమల్లో ఉన్నందున, ఈ రెండు నియోజకవర్గాల్లో పథకాన్ని ప్రారంభించేందుకు ఎన్నికల సంఘం (ఈసీ) అనుమతి నిరాకరించింది. తమిళ సంప్రదాయాలను గౌరవించడంతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# జన్వాడ ఫామ్‌హౌస్ నాది.. కేటీఆర్‌కు సంబంధం లేదు: యజమాని ప్రదీప్ రెడ్డి

రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైన జన్వాడ ఫామ్‌హౌస్ వివాదంపై దాని యజమాని ప్రదీప్ రెడ్డి స్పందించారు. ఆ ఫామ్‌హౌస్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎలాంటి సంబంధం లేదని, అది తన వ్యక్తిగత ఆస్తి అని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల నేతలు ఫామ్‌హౌస్‌ను సందర్శించాలని యోచిస్తున్నారన్న వార్తల నేపథ్యంలో ఆయన ఈ వివరణ ఇచ్చారు.ఈ సందర్భంగా ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ, "జన్వాడలోని ఫామ్‌హౌస్ భూమి నాది. కేటీఆర్, నేను చిన్ననాటి స్నేహితులం. ఆ ఫామ్‌హౌస్‌ను కేటీఆర్‌కు లీజుకు ఇచ్చాను. అంతకుమించి దీనితో ఆయనకు ఎటువంటి సంబంధం లేదు" అని తెలిపారు. ఆ భూమికి సంబంధించి ఎటువంటి వివాదాలు లేవని, అన్ని పత్రాలు చట్టబద్ధంగా, సక్రమంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వానికి గానీ, సంబంధిత అధికారులకు గానీ ఏవైనా అనుమానాలు ఉంటే, తనకు నోటీసులు జారీ చేసి వివరణ కోరవచ్చని ప్రదీప్ రెడ్డి సూచించారు. చట్టపరమైన ప్రక్రియ ద్వారా అవసరమైన అన్ని పత్రాలను సమర్పించడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అయితే, ప్రైవేట్ ఆస్తి వద్దకు రాజకీయ నేతలు వచ్చి తనిఖీలు చేయడం, దీనిని రాజకీయ వివాదంగా మార్చడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. చట్టప్రకారం జరిగే ఎటువంటి విచారణకైనా తాను పూర్తిగా సహకరిస్తానని ప్రదీప్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# తెలంగాణ (ఎన్ఆర్ఐ) కమిషన్ ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం

**ప్రవాస తెలంగాణ వాసుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి**
**ప్రవాస తెలంగాణ సమాజాన్ని రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలి**
**వినతి పత్రాన్ని స్వీకరించిన సీఎం..**
**ప్రతిపాదనను పరిశీలిస్తామని హామీ**
**పాలకుర్తి నియోజకవర్గం ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి**



ప్రజా వాయిస్ /పాలకుర్తి /సెప్టెంబర్ 18
తెలంగాణ రాష్ట్రంలో ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న ప్రవాస తెలంగాణ వాసుల (ఎన్ఆర్ఐ) హక్కుల పరిరక్షణ,వారి సమస్యల పరిష్కారం, రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం కోసం ప్రత్యేక తెలంగాణ ఎన్ఆర్ఐ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్,పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తో కలసి సిఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ,ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ తో కలిసి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయిన ఝాన్సీరెడ్డి.ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రవాస భారతీయుల తరఫున ఈ శుక్రవారం కీలక ప్రతిపాదనను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ. అమెరికా,గల్ఫ్ దేశాలు,యూరప్,కెనడా,ఆస్ట్రేలియా సహా ప్రపంచంలోని అనేక దేశాల్లో లక్షలాది మంది తెలంగాణ వాసులు నివసిస్తూ రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడులు,సాంకేతికత,విద్య,వైద్యం,సేవా కార్యక్రమాలు,ఉపాధి అవకాశాల ద్వారా విశేషంగా తోడ్పడుతున్నారని,అయితే ప్రవాస తెలంగాణ వాసులు మరియు వారి కుటుంబాలు ఆస్తి వివాదాలు,భూ సమస్యలు,న్యాయ సహాయం,అత్యవసర పరిస్థితులు,ప్రభుత్వ శాఖలతో సమన్వయం వంటి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని,ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా తెలంగాణలో ప్రత్యేక (ఎన్ఆర్ఐ) కమిషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వినతి పత్రంలో కోరారు.ఈ కమిషన్ ద్వారా ప్రవాస తెలంగాణ వాసుల కోసం ప్రత్యేక ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ,పెట్టుబడులకు సింగిల్ (ఎన్ఆర్ఐ )విండో విధానం,ఆస్తి రక్షణ,విదేశాల్లో అత్యవసర సమన్వయం,ప్రపంచవ్యాప్తంగా తెలంగాణలతో ప్రభుత్వ అనుసంధానం వంటి సేవలు అందించవచ్చని వివరించారు.వినతిపత్రాన్ని స్వీకరించిన సిఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదనను పరిశీలిస్తామని,ప్రవాస తెలంగాణ వాసుల సంక్షేమం మరియు రాష్ట్ర అభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా ఆలోచిస్తుందని,తెలంగాణ రాష్ట్రానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాస తెలంగాణ సమాజాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చి,వారి సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి వారి భాగస్వామ్యాన్ని మరింత పెంచే దిశగా ఈ వినతిపత్రం ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని ఝాన్సీరెడ్డి అభిప్రాయపడ్డారు.

# మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

- **ప్రజావాణికి తరలివచ్చిన 69 మంది మల్లన్నసాగర్ నిర్వాసితులు**
- **65 ఏళ్లు దాటిన 35 మంది ఒంటరి మహిళలకు ప్యాకేజీలు ఇవ్వాలి**
- **34 మంది నిర్వాసితులు**
- **పెండింగ్ నష్టపరిహారాలు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీలతో పాటు మౌలిక వసతులు కల్పించాలి**
- **నోడల్ అధికారి విద్యాసాగర్‌కు వినతిపత్రం అందజేత**




ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం : మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో పూర్తిగా ముంపునకు గురైన వేములఘాట్ గ్రామానికి చెందిన నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజాభవన్ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. మొత్తం 69 మంది నిర్వాసితులు ప్రజావాణికి హాజరయ్యారు. వీరిలో 65 సంవత్సరాలు దాటిన 35 మంది ఒంటరి మహిళలు, 34 నిర్వాసితులు ఉన్నారు. తమకు రావాల్సిన నష్టపరిహారాలు, పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు, మౌలిక వసతుల సమస్యలను ప్రజావాణి నోడల్ అధికారి విద్యాసాగర్‌కు వివరించారు. ఈ సందర్భంగా 65 ఏళ్లు దాటిన ఒంటరి మహిళలు, పురుషులకు సంబంధించిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీల సమస్యను నోడల్ అధికారి విద్యాసాగర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిశీలించిన ఆయన వెంటనే స్పందించి ఐక్యాడ్ కార్యదర్శికి లేఖ రాశారు. నిర్వాసితులకు రావాల్సిన వివిధ రకాల నష్టపరిహారాలకు సంబంధించిన అంశాలను కూడా లేఖలో పొందుపరిచారు. అదేవిధంగా పునరావాస కాలనీలో వైకుంఠధామం, ఖబర్‌స్థాన్ ఏర్పాటు చేయాల్సిన సమస్యను నిర్వాసితులు నోడల్ అధికారి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేసి సమస్యపై మాట్లాడినట్లు తెలిపారు. వేములఘాట్ గ్రామం మల్లన్నసాగర్ ప్రాజెక్టులో పూర్తిగా ముంపునకు గురికావడంతో నిర్వాసితులకు గతంలో భూసేకరణ ప్రక్రియలో ఎదురైన సమస్యలు, అనంతరం పునరావాసం, నష్టపరిహారం విషయంలో ఏర్పడిన ఇబ్బందులను వారు వివరించారు. పట్టా, ప్రభుత్వ భూములకు సంబంధించిన పెండింగ్ నష్టపరిహారాలను చెల్లించాలని కోరారు. వ్యవసాయ భూముల్లో ఉన్న చెట్లు, బోర్లు, బావులకు సంబంధించిన నష్టపరిహారం కూడా అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్లకు, ఇళ్ల పక్కన ఉన్న ఖాళీ స్థలాలకు రావాల్సిన పరిహారం చెల్లించడంతో పాటు అర్హులైన ప్రతి నిర్వాసిత కుటుంబానికి పెండింగ్‌లో ఉన్న ఆర్అండ్ఆర్ ప్యాకేజీలను మంజూరు చేయాలని కోరారు. 250 గజాల ఇంటి స్థలాలు రిజిస్ట్రేషన్ జరిగినప్పటికీ కొందరికి ఇప్పటికీ స్థలాలను చూపించలేదని, మరికొందరికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికాలేదని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ స్థలాలు అందించి, స్వాధీనం కల్పించాలని కోరారు. పునరావాస కాలనీల్లో పాఠశాలలు, ఆలయాలు, మసీదులు, చర్చిలతో పాటు తాగునీటి కోసం నీటి ట్యాంకులు, ఇంటింటికీ కుళాయి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ తదితర మౌలిక వసతులను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని కోరారు. పునరావాస కాలనీలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వృద్ధాప్యంలో ఉన్న ఒంటరి మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా రావాల్సిన ప్యాకేజీలను త్వరితగతిన మంజూరు చేసి, మల్లన్నసాగర్ నిర్వాసితుల పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎనిమిదో వార్డ్ కౌన్సిలర్ విష్ణువర్ధన్ రెడ్డి, 9 వ వార్డు కౌన్సిలర్ ఉపేందర్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, రాజు, మహేష్, కర్ణాకర్, సత్తి రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, చిర్ల పొచవ్వ, లక్ష్మి, గంగవ్వ, యాదవ్వ, బలవ్వ తదితరులు పాల్గొన్నారు

# గణనాథుని సన్నిధిలో ఘనంగా మహా కుంకుమ పూజ

- **మహిళా భక్తుల సామూహిక పూజలతో ఆధ్యాత్మిక శోభ**
- **ఎనిమిదేళ్లుగా సంప్రదాయంగా కొనసాగుతున్న వేడుక**

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :
పూసాల రోడ్‌లోని మనం గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా కుంకుమ పూజ భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది. గణనాథుని సన్నిధిలో బ్రహ్మశ్రీ కందుకూరి ఈశ్వరాచారి అయ్యగారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని సామూహికంగా కుంకుమ పూజలు నిర్వహించారు. కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి నెలకొనాలని గణనాథుని వేడుకున్నారు. వేద మంత్రోచ్చారణలు, భక్తుల పూజలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.మనం గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా కుంకుమ పూజను గత ఎనిమిదేళ్లుగా నిరంతరంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏటా ఈ కార్యక్రమానికి మహిళా భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొయ్యడ రమేష్, వార్డు కౌన్సిలర్ గాదాసు మంజుల రవి, గరిగే శ్రీనివాస్, ఆవుల శివకుమార్, నల్ల సంపత్, పూసాల రామకృష్ణ, కొయ్యడ శంకర్, కొరపాటి సంపత్, కొరపాటి రవిచంద్రతో పాటు కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# రెడ్ క్రాస్ సొసైటీ ఓటర్ల జాబితా సిద్ధం

## అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి

ప్రజా వాయిస్ కామారెడ్డి/
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధం చేశామని అదనపు కలెక్టర్ తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ కార్యవర్గ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను జిల్లాలోని అన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తహశీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు ఎన్. వై. గిరి తెలిపారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులందరూ తమకు సమీపంలోని ఎంపీడీవో లేదా తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటర్ల జాబితాలో తమ పేరు, ఇతర వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు లేదా తప్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ఎన్నికల షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 19న ఓటర్ల జాబితా ప్రచురణతో పాటు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 24న నామినేషన్ల స్వీకరణ, సెప్టెంబర్ 25న నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 26న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించడంతో పాటు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నట్లు వెల్లడించారు.ఎన్నికల పోలింగ్ తేదీ ను తాత్కాలికంగా అక్టోబర్ 4వ తేదీగా నిర్ణయించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.





# రీ సర్వేతో రైతులకు మరింత ప్రయోజనం

## అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా భూ సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ తెలిపారు. శుక్రవారం కౌటాల మండలం బారేపల్లి గ్రామ శివారులో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను జిల్లా భూ కొలతల అధికారి వినయ్ కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు.నక్షాలు లేని గ్రామాల్లో రీ సర్వే నిర్వహిస్తున్నామని, దీనివల్ల భవిష్యత్తులో రైతుల మధ్య గట్ల తగాదాలు తలెత్తవని అదనపు కలెక్టర్ వివరించారు. రికార్డుల్లో ఉన్నట్టుగానే రైతుల భూమి విస్తీర్ణం నమోదవుతుందని, భూ తగాదాలకు ఆస్కారం లేకుండా సర్వే ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# కౌటాలలో పౌల్ట్రీ శిక్షణతో గ్రామీణ జీవనోపాధికి ప్రోత్సాహం

ప్రజా వాయిస్ కౌటాల
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది రైతులకు మూడు రోజుల పాటు బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ ఫార్మింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌లోని పి.వి.నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీలో ఈ శిక్షణ జరిగింది.బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ పెంపకం ప్రాముఖ్యత, గ్రామీణ జీవనోపాధి అవకాశాలు, మెరుగైన కోళ్ల రకాలు, దాణా, ఆరోగ్య సంరక్షణ, సాధారణ నిర్వహణ పద్ధతులపై నిపుణులు రైతులకు అవగాహన కల్పించారు. అలాగే పిఈఎస్ ఫామ్‌ను సందర్శించి వివిధ కోళ్ల జాతులు, మెరుగైన రకాలను రైతులు ప్రత్యక్షంగా పరిశీలించారు. మూడు రోజుల శిక్షణ పూర్తి చేసిన రైతులకు ధ్రువపత్రాలు అందజేశారు.బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ ద్వారా రైతులకు అదనపు ఆదాయం, గ్రామీణ స్థాయిలో స్థిరమైన జీవనోపాధి అవకాశాలు పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ బి. ప్రతాప్, ప్రోగ్రామ్ అసోసియేట్ గోండ్ గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

# మాటూరులో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

**సీజనల్ వ్యాధుల నివారణకు గడ్డి మందు పిచికారీ**
**సర్పంచ్ జన్నె సిద్ధులు ఆధ్వర్యంలో చర్యలు**



మోటకొండూరు, సెప్టెంబర్ 18 (ప్రజా వాయిస్):-
వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మండలంలోని మాటూరు గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా సర్పంచ్ జన్నె సిద్ధులు ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధులు, రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కల నివారణకు ప్రత్యేకంగా గడ్డి మందును (కలుపు నివారణ మందు) పిచికారీ చేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు, పొదలు విపరీతంగా పెరిగాయి. వీటి ద్వారా దోమలు, హానికరమైన కీటకాలు వృద్ధి చెంది విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉండటంతో ముందుజాగ్రత్త చర్యగా పంచాయతీ సిబ్బందితో ఈ పిచికారీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ జన్నె సిద్ధులు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య రక్షణే తమ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. గ్రామస్తులు డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల పట్ల తీవ్ర అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పాత టైర్లు, కొబ్బరి బొండాలు, గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. పరిసరాల పరిశుభ్రతలో గ్రామస్తులంతా భాగస్వాములు కావాలని, పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ ఆసరా

**మృతురాలి కుటుంబానికి బియ్యం పంపిణీ, సర్పంచ్ ఆర్థిక సాయం**

**మోటకొండూర్, సెప్టెంబర్ 18 (ప్రజా వాయిస్):-**
మోటకొండూరు మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన కొల్లూరి శ్యామల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణి, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఫౌండేషన్ తరఫున సమకూర్చిన 50 కిలోల బియ్యాన్ని స్థానిక గ్రామ శాఖ అధ్యక్షుడు కొల్లూరి హరిబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మృతురాలి కుటుంబానికి అందజేశారు. ఇదే కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పేరబోయిన దివ్య మకరజ్యోతి కార్తీక్ తన వంతుగా మృతురాలి కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేసి ఉదారత చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లత నాగరాజు, వార్డు సభ్యులు పుల్లె భాస్కర్, మారబోయిన పద్మ పాండు, పేరబోయిన శ్రీకాంత్, సీనియర్ నాయకులు కొల్లూరి ఆంజనేయులు, పేరబోయిన చంద్రయ్య, కొల్లూరి యాదయ్య, కొల్లూరి సంజీవ, నల్లమాస అంజయ్య, కమిటీ సభ్యులు పేరబోయిన శంకర్, కొల్లూరి వరప్రసాద్, యువ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# తెల్కపల్లిలో ఫామ్ పాండ్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీడీఓ జి.తరుణ్

**ప్రజా వాయిస్ తెల్కపల్లి, సెప్టెంబర్ 18**
తెల్కపల్లి గ్రామంలో సొంటె పెద్ద జంగయ్యకు చెందిన వ్యవసాయ పొలంలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న ఫామ్ పాండ్ (పంట కుంట) నిర్మాణ పనులను ఎంపీడీఓ గుగులోతు.తరుణ్ గురువారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మస్టర్ రోల్ ను కాల్ చేసి, పనుల్లో పాల్గొంటున్న కూలీల హాజరును పరిశీలించారు. కూలీలతో మాట్లాడి పని విధానం, వేతనాలు, కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, కూలీలందరూ సమయపాలన పాటిస్తూ విధులకు హాజరు కావాలని సూచించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు సరిగా కురవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలను పెంచుకోవడానికి ఇదే సరైన సమయమని అన్నారు.మండల పరిధిలోని ప్రతి రైతు తమ పొలాల్లో తప్పనిసరిగా పంట కుంటలను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. దీని వల్ల వర్షపు నీటిని నిల్వ చేసుకుని పంటలకు ఉపయోగించుకోవచ్చని తెలిపారు.అదే విధంగా గ్రామంలోని ప్రతి ఇంటి వద్ద సోక్ పిట్ (ఇంకుడు గుంత) నిర్మాణం చేపట్టాలని సూచించారు. మురుగు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు.ప్రతి గ్రామంలో ఊట కుంటలను ఏర్పాటు చేయాలని, పడే ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టి భూగర్భ జలాలను కాపాడుకోవాలని అన్నారు. నీరే జీవనాధారమని, నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీఓ మల్లేష్, టెక్నికల్ అసిస్టెంట్ హరికృష్ణ, మేట్ బక్కయ్య, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తి కనబడుటలేదు కేసు నమోదు చేసిన పోలీసులు

**సెప్టెంబర్ 18 (ప్రజా వాయిస్)చేగుంట:**



ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన సంద స్వామి వయస్సు (38) గురువారం సాయంత్రం తన ఇంట్లో నుండి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో, చుట్టుపక్కల, వెతికిన మరియు బంధువుల వద్ద కూడా వెతికిన ఆచూకీ తెలవకపోవడంతో , అతని భార్య సంద బాగ్య లక్ష్మి ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



# ప్రజలకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యంగా అభివృద్ధి

**మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్**

**63 లక్షలతో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం**

**దుర్గమ్మ దేవాలయం మార్గంలో సీసీ రోడ్డు, భూగర్భ మురుగు కాలువల నిర్మాణం**

**జిన్నారం ప్రజావాయిస్**
మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను లక్ష్యంగా ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అన్నారు. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని దుర్గమ్మ దేవాలయం మార్గంలో సుమారు రూ.63 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, భూగర్భ మురుగు కాలువ, తాగునీటి పైపులైన్ పనులకు శుక్రవారం వార్డు కౌన్సిలర్లతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. రహదారులతో పాటు మురుగు కాలువలు, తాగునీటి పైపులైన్ల వంటి మౌలిక వసతులను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనులకు ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు కత్తుల రమేష్, పిఎసిఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు మంద బలరాం రెడ్డి, పడమటి లక్ష్మారెడ్డి, భాస్కర్ రెడ్డి, వెంకట్రాం రెడ్డి, సత్యనారాయణ, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వాసుదేవ రెడ్డి గ్రామ పెద్దలు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# తాగునీటి కోసం వెళ్లి విద్యుత్ షాక్ తో మహిళ మృతి

**ప్రజా వాయిస్, పాపన్నపేట**
పాపన్నపేట మండల పరిధిలోని చీకోడ్ లో విషాదం చోటు చేసుకుంది. వ్యవసాయ పనులకు వెళ్లిన బద్దం శోభారాణి అలసటతో త్రాగునీటి కోసం సమీపంలోని బోరుబావి వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు బోరుబావిపై పడడంతో విద్యుత్ షాక్ కుగురై మృతి చెందారు. పోలీసులు కాంచనమా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుమారుడు సంపత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.



# మట్టి గణపతినే పూజిద్దాం..

**వినాయక చవితి వేళ విద్యార్థుల ప్రతిభ తో మట్టి గణపతులు**

**ప్రజా వాయిస్ నాగర్ కర్నూల్ సెప్టెంబర్18**
వినాయక చవితి అంటే కొత్త విగ్రహం కొనుకొచ్చి పూజలు చేయడం మాత్రమే కాదు. మన చేతుల్లోనే పర్యావరణ రహిత గణపతిని తయారు చేసుకోవచ్చని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రెయిన్ బో ప్రీ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు నిరూపించారు. వినాయక చవితి సందర్భంగా విద్యార్థులు స్వయంగా మట్టితో రకరకాల రూపంలో గణేశా గ్రహాలను తయారుచేస్తూ తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కరిగిపోతాయని దీనివల్ల జలా వనరులకు జీవరాశులకు ఎలాంటి హానికరం జరగదని విద్యార్థులు తోటి వారికి ప్రజలకు అవగాహన కల్పించారు. విగ్రహాలు కొనుగోలు చేయకుండా తమ సృజనాత్మకతకు పదును పెట్టి స్వేచ్ఛమైన మట్టితో వినాయక విగ్రహాలను స్వయంగా తయారు చేసుకోని పర్యావరణనీ పరిరక్షించాలని విద్యార్థులు తెలిపారు. మట్టి విగ్రహాలను పూజించాలని సందేశాన్ని విద్యార్థులు కళాత్మకంగా చాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శిరీష, కరస్పాండెంట్, శ్రీరంగం సత్యనారాయణ చార్యులు, కళ్యాణి, అర్చన, జయంతి, అనుష, సుజాత, శిరీష, నవిత, శివలీల, జబీనా, ప్రసన్న, మంజుల, పరుశురాం తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# గణనాథుడికి పూజలు - అధికారులకు దిశానిర్దేశం

**వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలి**

**జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి**

**ప్రజా వాయిస్//రాజేంద్రనగర్:**
బుద్వేల్‌లోని అత్తాపూర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో నెలకొల్పిన మట్టి గణనాథుడికి రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డితో పాటు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.అనంతరం అధికారులు,సిబ్బందితో జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.మండపాల పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.నిమజ్జన ప్రాంతాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని,విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.పత్తికుంట, పల్లె చెరువు,మూసీ తదితర ప్రాంతాల్లో నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించాలని,నిమజ్జన కార్యక్రమాలు సజావుగా జరిగేందుకు అధికారులకు సహకరించాలని జోనల్ కమిషనర్ కోరారు.

# ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం



**ప్రజా వాయిస్, కథలాపూర్**
విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఏఎంసీ వైస్ చైర్మన్ పులి శిరీష హరిప్రసాద్ అన్నారు. కథలాపూర్ మండల కేంద్రంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఆమె ఘనంగా సత్కరించారు. రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీత గుండు విజయ్ కుమార్ (తండ్రియాల్)తో పాటు జిల్లా స్థాయి అవార్డులు పొందిన టి. మధు కుమార్ (బొమ్మెన), కే. శ్రీనివాస్ (పోతారం), టి. శ్రీనివాస్ (దుంపేట), ఎమ్. సాయిరెడ్డి (బొమ్మెన), పి. రవి (పోసానిపేట)లను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ పురస్కారాలు మండలానికి గర్వకారణమని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎండి. రజియాబేగం అజీమ్, యువజన కాంగ్రెస్ నాయకులు కాసోజీ వంశీ, లింగరావు, ఎండి. రెహన్, వార్డు మెంబర్ లైశెట్టి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాలలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ వర్గం బలప్రదర్శన

**ఇందారం ఎక్స్‌రోడ్ నుంచి మంచిర్యాల వరకు భారీ బైక్ ర్యాలీ**

**మంతెన జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో ఘన స్వాగతం**

**ప్రజా వాయిస్. మంచిర్యాల**



మంచిర్యాల జిల్లాలో ఎంపీ గడ్డం వంశీకృష్ణకు మంతెన జగన్‌మోహన్‌రావు వర్గం ఘన స్వాగతం పలికింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మంతెన జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో ఇందారం ఎక్స్‌రోడ్ వద్ద ఎంపీ వంశీకృష్ణకు నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇందారం ఎక్స్‌రోడ్ నుంచి మంచిర్యాల వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బైక్‌లపై ర్యాలీగా మంచిర్యాలకు చేరుకుని ఐబీ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణకు మంతెన జగన్‌మోహన్‌రావు వర్గం తమ బలాన్ని చాటుతూ ఘన స్వాగతం పలికింది.



## గ్రామాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజా వాయిస్, కథలాపూర్:**
మండల పరిధిలోని ఇప్పపల్లి, సిరికొండ గ్రామ పంచాయతీల్లో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలు, నిర్మాణంలో ఉన్న మహిళా సమాఖ్య (విఓ) భవనాలు, అంగన్‌వాడీ సెంటర్లు, కిచెన్ షెడ్లను ఆయన పరిశీలించారు. అనంతరం సిరికొండ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ఆర్‌డీఓ, డీపీఓ, అదనపు డీఆర్‌డీఓ, డీఈఓ, డీవై, పీఆర్ ఈఈ, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, ఎంపీఓ, ఏఈ మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అన్నదానం మహాదానం.. భక్తి భావంతో సేవా కార్యక్రమం

### విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

**ప్రజా వాయిస్ వేములపల్లి:**
అన్నదానం మహాదానమని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు నామిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. శుక్రవారం వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామంలో విగ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సర్పంచ్ జేరిపోతుల మౌనిక సురేందర్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు స్వయంగా అన్నప్రసాదాలను వడ్డించారు. ఈ సందర్భంగా నామిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ.. వినాయకుని ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. వినాయక చవితి సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం అందించడం ద్వారా విగ్నేశ్వర యూత్ సభ్యులు సేవా స్ఫూర్తిని చాటుతున్నారని కొనియాడారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతల సేవాభావాన్ని ప్రత్యేకంగా అభినందించారు. గ్రామంలో ఐక్యత, భక్తి భావాలను పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమానికి సహకరించిన దాతలకు విగ్నేశ్వర యూత్ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విగ్నేశ్వర యూత్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ముత్యంపేట సబ్ సెంటర్ ను సందర్శించిన డీఎంహెచ్వో వేంకట్

**ప్రజా వాయిస్ దోమకొండ సెప్టెంబర్ 18.**
దోమకొండ మండలంలోని ముత్యంపేట గ్రామ ప్రైమరీ హెల్త్ సబ్ సెంటర్ ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. వెంకట్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సబ్ సెంటర్ లోని రికార్డులు, రిజిస్టర్లను అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వాంతులు విరోచనాలు, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, వ్యాధులు ప్రభావం పెరిగే అవకాశం ఉన్నందున అవసరమైన మందులు ముందస్తుగా అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే సబ్ సెంటర్లోని అధికారులకు సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.





## వరల్డ్ డెఫ్ డే సందర్భంగా భవిత విలీన విద్య వనరుల కేంద్రం పాఠశాల సందర్శన

**ప్రజా వాయిస్ సెప్టెంబర్18**
**నాగర్ కర్నూల్**
రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం
నాగర్‌కర్నూల్ పట్టణంలోని భవిత విలీన విద్య వనరుల కేంద్రం పాఠశాలను సందర్శించిన జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ నిహారిక
వైకల్యం గల పిల్లల పట్ల సమాజంలో ఎలాంటి వివక్ష చూపరాదని నిహారిక సూచన
వైకల్యం ఉన్న పిల్లలకు ప్రత్యేక వసతులు కల్పించి అందరితో సమానంగా చూడాలని పిలుపు
నేటితరం యువతలో అనేక మంది శారీరక, మానసిక సమస్యలతో బాధపడుతున్నారని వెల్లడి
చిన్నారులతో మాట్లాడి వారి సమస్యలు, పాఠశాలలో కల్పిస్తున్న వసతులపై ఆరా తీసిన నిహారిక
ఎవరూ అధైర్యపడవద్దని చిన్నారులకు భరోసా
ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఒంటరిగా ఉన్నామనే భావనకు గురికాకుండా సమాజం అండగా నిలవాలని సూచన
వైకల్యం ఉన్న వ్యక్తుల పట్ల ప్రతి ఒక్కరూ సహృద్భావంతో మెలగాలని పిలుపు
వరల్డ్ డెఫ్ డే సందర్భంగా చిన్నారులకు పండ్ల పంపిణీ
కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకుడు ప్రకాష్, చిన్నారులు పాల్గొన్నారు



## నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి :డి. సి.పి నారాయణ రెడ్డి

**ప్రజా వాయిస్ కల్వకుర్తి ( సెప్టెంబర్ 18 )**
వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని మహేశ్వరం జోన్ డీసీపీ కె. నారాయణరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమనగల్లోని సూరసముద్రం చెరువు నిమజ్జన ప్రాంతాన్ని ఆయన సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, పార్కింగ్, భద్రతా చర్యలు, పోలీసు సిబ్బంది విధుల కేటాయింపు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జన ఊరేగింపులు, భక్తుల రాకపోకల సమయంలో అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, పోలీసు అధికారులతో డీసీపీ సమీక్ష నిర్వహించారు. నిమజ్జన ప్రాంతంలో అవసరమైన అన్ని ఏర్పాట్లను సంబంధిత శాఖల సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. వినాయక నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని ఆమనగల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గణేష్ ఉత్సవ కమిటీలు మరియు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## అక్రమ వైద్య కేంద్రాలపై ఉక్కుపాదం

### అనుమతులు లేకుండా వైద్యం చేస్తే కఠిన చర్యలు
### అక్రమ క్లినిక్‌లు,ల్యాబ్‌లపై వరుస తనిఖీలు
### నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ తప్పదు
### డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి హెచ్చరిక



**ప్రజా వాయిస్// రాజేంద్రనగర్:**
ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే అక్రమ క్లినిక్‌లు, అనుమతులు లేని ల్యాబ్‌లపై వైద్య ఆరోగ్యశాఖ కొరడా ఝుళిపిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందించే కేంద్రాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో డా. స్వర్ణకుమారి స్పష్టం చేశారు. జిల్లాలో చేపట్టిన తనిఖీల్లో భాగంగా హఫీజ్‌పేట్‌లోని ఆర్‌ఐఎ క్లినిక్ అండ్ డయాగ్నస్టిక్ సెంటర్, గండిపేట మండలం నార్సింగిలోని ప్రియదర్శిని క్లినిక్‌ను అధికారులు సీజ్ చేశారు. అనుమతులు లేకుండా రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గుర్తించిన హఫీజ్‌పేట్ కేంద్రంపై, నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్ నిర్వహిస్తున్నట్లు గుర్తించిన నార్సింగి కేంద్రంపై చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా, లేదా నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తే కఠిన చర్యలు తప్పవు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యంతో చెలగాటమాడే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అక్రమ క్లినిక్‌లు, ల్యాబ్‌లను గుర్తించేందుకు జిల్లావ్యాప్తంగా తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. నిబంధనలు పాటించకుండా వైద్య సేవలు అందిస్తున్న కేంద్రాలపై సమాచారం ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. అనుమతులు లేని వైద్య కేంద్రాలపై చర్యలు తీసుకోవడమే కాకుండా, ఇలాంటి కేంద్రాలు మళ్లీ కార్యకలాపాలు కొనసాగించకుండా నిఘా కొనసాగించాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించిందని స్పష్టం చేశారు.






## మల్లెగూడలో పలువురు కాంగ్రెస్‌లో చేరిక

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
ఆసిఫాబాద్ జిల్లా నార్నూర్ మండలం మల్లెగూడ గ్రామంలో ఉప సర్పంచ్ రాజుతో పాటు పలువురు గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ ఆధ్వర్యంలో వారు పార్టీ కండువాలు కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారికి శ్యామ్ నాయక్ స్వాగతం పలికి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కలిసి పనిచేయాలని కోరారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లెగూడ బీఎల్ఏ దిలీప్, జీవన్, సూర్యకాంత్, యోగిరాజ్, బాలేష్ రావు, వినోద్, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పదేళ్లుగా మట్టి విగ్రహాలను ప్రతిష్టిస్తున్న నందిరాజు అసోసియేషన్

### బీఎన్ రెడ్డి నగర్‌లో పదేళ్లుగా మట్టి గణపతి ప్రతిష్ఠ.
### వీరే మట్టి తెచ్చి.. వీరే విగ్రహం తయారీ చేసుకోవడం విశేషం.
### సన్నాయి మేళంతో సంప్రదాయబద్ధంగా గణపతి ఊరేగింపు.
### డీజే, బ్యాండ్‌లకు దూరంగా నిమజ్జన వేడుకలు.
### మట్టి వినాయకులను ప్రోత్సహించాలని పిలుపు



**ప్రజా వాయిస్, బిఎన్ రెడ్డి నగర్.**
హైదరాబాద్ నగరంలోని బీఎన్ రెడ్డి నగర్‌లో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ గంగిరెద్దుల కులస్థులు మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దాదాపు పదేళ్లుగా ప్రతి ఏడాది మట్టి విగ్రహాన్నే ఏర్పాటు చేస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కాగా ఈ గణపతి విగ్రహాన్ని వీరే స్వయంగా తయారు చేయడం ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇందుకోసం అవసరమైన మట్టిని సొంతంగా కొనుగోలు చేసి.. ఎలాంటి యంత్రాల సహాయం లేకుండా సంప్రదాయ పద్ధతిలో స్వయంగా విగ్రహాన్ని తయారు చేస్తారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలకు సందేశం ఇస్తున్నారు. వీరు ఏర్పాటు చేసే గణపతిని దర్శించుకునేందుకు ప్రజా ప్రతినిధులు సైతం తరలివస్తుంటారు. నిమజ్జనం సమయంలోనూ ప్రత్యేక సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. డీజేలు, బ్యాండ్లకు దూరంగా ఉంటూ.. సన్నాయి మేళంతో సంప్రదాయబద్ధంగా గణపతిని ఊరేగింపుగా తీసుకెళ్తారు. మట్టి వినాయకుడి ప్రతిష్ఠతో పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తూ.. సంప్రదాయాలను కాపాడుతున్న గంగిరెద్దుల కులస్థుల ప్రయత్నాన్ని పలువురు అభినందిస్తున్నారు.

## తుక్కాపూర్‌లో డ్రై డే-ఫ్రైడే కార్యక్రమం

**ప్రజా వాయిస్ దుబ్బాక/తొగుట**
తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో డ్రై డే--ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం, మంగళవారం రోజున ఇంట్లోని నీటి నిల్వలు, కూలర్లు, ఫ్రిజ్‌లు, పూలకుండీలు, ఇతర ప్రదేశాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు చెత్తాచెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామ ప్రజలందరూ డ్రై డే--ఫ్రైడే కార్యక్రమంలో భాగస్వాములై తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే దోమల ద్వారా వచ్చే వ్యాధులను నియంత్రించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నర్సింగరావు, ఆశా వర్కర్ శ్రీమతి చిక్కుడు స్వరూప, మహిళా సంఘం జూ లింగాల భవాని, గ్రామపంచాయతీ సిబ్బంది సాయిలు తదితరులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

